RNI NO : TELTEL/2023/89146

Telugu Daily

# శెనార్తి మీడియా

మన యాసే.. మన బలం

తెలుగుదినపత్రిక సంపుటి :3 సంచిక: 16 గురువారం 5 ఫిబ్రవరి 2026 పేజీలు :8 వెల రూ.5

Published from : Karimnagar Circulated to : Adilabad, Warangal, Hyderabad, Khammam, Nalgonda, Mahbubnagar, Medak, Nizambad, Rangareddy

రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి

శెనార్తి మీడియా

ఆహ్వానం పలుకుతుంది

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో రిపోర్టర్లుగా పని చేసేందుకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లలలో సంప్రదించగలరు.

PRESS

77309 83966 98491 98098

## ఐదు నిమిషాలకే లోక్‌సభ వాయిదా



- నరవణె పుస్తకంపై భయపడుతున్న ప్రభుత్వం
- కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ విమర్శలు

విపక్ష సభ్యుల ఆందోళనల మధ్య లోక్‌సభ నేటికి (గురువారం)కి వాయిదా పడింది. షెడ్యూల్ ప్రకారం బడ్జెట్‌పై రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. లోక్‌సభలో ప్రసంగించాల్సి ఉంది. అయితే మోదీ ప్రసంగానికి ముందే సభను స్పీకర్ గురువారానికి వాయిదా వేశారు.

4




## కొరియన్ గేమ్ మరణశాసనం

- ఆన్‌లైన్ గేమ్‌కు బానిసలై యూపిలో ముగ్గురు అక్కాచెల్లెళ్ల బలవన్మరణం

4



# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌నే గెలిపించండి

## సన్నబియ్యం తీసుకున్న వారంతా ఓటేయాలి

- మున్సిపల్ ఎన్నికల తరవాత రైతుభరోసా
- రైతులకు గిట్టుబాటు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తున్నాం
- తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్
- తెలంగాణ తల్లి మన సోనియమ్మ
- మిర్యాలగూడలో సీఎం రేవంత్ రెడ్డి



**మిర్యాలగూడ, ఫిబ్రవరి 4:** రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని చూసి మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలి. ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎదురే లేదు.. విజయాన్ని అడ్డుకోలేరని అన్నారు. మిర్యాలగూడ మండలం గూడూరులో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన 'ప్రజా పాలన - ప్రజా విజయోత్సవ' సభలో సీఎం ప్రసంగించారు. రేషన్ కార్డుల కోసం గతంలో పదేళ్ల పాటు ఎదురుచూడాల్సిన పరిస్థితి. ప్రస్తుతం రాష్ట్రంలో 3.17 కోట్ల మందికి 6 కిలోల చొప్పున సన్న బియ్యం ఇస్తున్నాం. సన్న బియ్యం వచ్చిన వారు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ప్రజలు కాంగ్రెస్‌కే ఓటు వేయాలని పిలుపునిచ్చారు. వరి ఉత్పత్తిలో మిర్యాలగూడ ఆసియాలోనే ముందుంది.

మిగతా 2 లో



## ముస్లింల ఓట్ల కోసం కాంగ్రెస్ ఆరాటం

- ఎస్సీ, ఎస్టీ నిధులు మైనార్టీలకు మళ్లింపు
- నిజాం నిరంకుశానికి అంకుశం వేసిన గడ్డ ఇదే
- ఎన్నికల హామీలను తుంగలో తొక్కిన సీఎం రేవంత్
- బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్

4

## జగిత్యాల ఎమ్మెల్యేకు క్లీన్ చిట్

పార్టీ మారిన దాఖలాలు లేవన్న స్పీకర్



3



## విద్యాసంస్థల్లో బీసీ విద్యార్థుల జాబితా

- తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ సమీక్ష

2

# చిత్ర పరిశ్రమకు పెద్దపీట

- సినీ పరిశ్రమ కేంద్రంగా హైదరాబాద్
- అన్ని భాషల వారు తరలివచ్చినా ప్రోత్సాహం
- ఉగాది రోజు గద్దర్ అవార్డుల ప్రదానం
- మీ డియాతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్, ఫిబ్రవరి 4:** తెలుగు సినీ పరిశ్రమకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి ప్రాధాన్యత ఇస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలో గద్దర్ అవార్డుల జ్యూరీ సభ్యులతో డిప్యూటీ సీఎం కీలక సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌ను ఫిల్మ్ ఇండస్ట్రీకి కేంద్రంగా చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. అన్ని భాషల సినీ పరిశ్రమలు ఇక్కడికి విస్తరించేలా అనుకూల వాతావరణం కల్పిస్తామన్నారు. దీని ద్వారా సినీ రంగంలో యువత, టెక్నీషియన్లకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. సినీ ప్రపంచ మార్కెట్‌కు హైదరాబాద్ కేంద్రంగా మారుతుందని వెల్లడించారు. కళల ద్వారా సమాజానికి తన జీవితాన్ని అర్పించిన మహానుభావుడు

మిగతా 2 లో



## విద్యుత్తు కనెక్షన్లకు కొత్త రూల్స్

మార్గదర్శకాలు విడుదల చేసిన ఈఆర్సీ

2



## జర్నలిస్టుల కుటుంబాలకు ప్రభుత్వం అండ

- శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

2

## మిర్చి రైతుకు గుడ్ న్యూస్

- ఎనుమాముల మార్కెట్‌లో భారీగా పెరిగిన ధరలు
- దేశీ మిర్చి క్వింటా 41,200 రూపాయలకు అమ్మకం

2



## స్కూళ్లల్లో పిల్లలతో వెట్టిపై వార్తా కథనాలు

మానవహక్కుల కమిషన్ సుమోటో కేసు

2



# మిర్చి రైతుకు గుడ్ న్యూస్

## ఎనుమాముల మార్కెట్‌లో భారీగా పెరిగిన ధరలు

## దేశీ మిర్చి క్వింటా 41,200 రూపాయలకు అమ్మకం

**వరంగల్,ఫిబ్రవరి 4 :** తెలంగాణలో మిర్చి ధరలు గణనీయంగా పెరుగుతున్నాయి, రైతులకు ఆశాజనకంగా మారాయి. వరంగల్ జిల్లా ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో దేశీ మిర్చి క్వింటా 41,200 రూపాయలకు, ఎల్లో మిర్చి క్వింటా 44,000 రూపాయలకు అమ్ముడయ్యింది. వండర్ హాట్ మిర్చి ధర ఒక్కరోజులో 5,000 రూపాయలు పెరిగి క్వింటా 37,100కి చేరింది. అంతర్జాతీయ డిమాండ్ పెరుగుదల, ఇతర రాష్టాల్లో ఉత్పత్తి తగ్గడం ఈ ధరల పెరుగుదలకు ప్రధాన కారణమని వ్యాపారులు తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా తక్కువ ధరల కారణంగా బాధపడ్డ రైతులకు ఈ పరిస్థితి పెద్ద ఊరటనిస్తుంది.వివిధ రకాల మిర్చి ధరలు ఊహించనంత వేగంగా పెరుగుతుండడం రైతుల ఆదాయాన్ని గణనీయంగా పెంచింది. ఎల్లో, దేశీ, వండర్ హాట్ మిర్చి వంటి రకాల డిమాండ్ అంతర్జాతీయంగా కూడా ఎక్కువగా ఉండటంతో మార్కెట్ ఉత్సాహంగా ఉంది. రైతులు తమ ఉత్పత్తిని పెద్ద ధరకు విక్రయించగలిగితే, ఆర్థిక స్థితి మెరుగుపడుతుంది. వరంగల్ ఎనుమాముల మార్కెట్‌లో ప్రతి రకానికి ప్రత్యేక ధరలు ఉన్నాయని, ధరల పెరుగుదల కొనసాగుతుందని అధికారులు తెలిపారు. ధరల పెరుగుదల రైతుల ఉత్సాహాన్ని పెంచింది, కానీ నిలకడైన ఆదాయం కోసం మంచి మార్కెట్ వ్యూహాలు అవసరం. పంటలను సరైన సమయంలో మార్కెట్లో విడుదల చేయడం, నిల్వ మరియు రవాణా సదుపాయాలను మెరుగుపరచడం కీలకం. అంతర్జాతీయ మార్కెట్ ట్రెండ్‌లను గమనించి, ధరల మార్పులపై రైతులు సరిగా నిర్ణయాలు తీసుకోవాలి. ఈ పరిస్థితులు, రైతుల ఆర్థిక స్థితిని బలోపేతం చేస్తూ, స్థిరమైన లాభాలను అందించగలవని విశ్లేషకులు పేర్కొన్నారు.

# విద్యాసంస్థల్లో బీసీ విద్యార్థుల జాబితా

## తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ సమీక్ష



**హైదరాబాద్, ఫిబ్రవరి 4:** రాష్ట్రంలో వివిధ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థుల సమాచారాన్ని కులాల వారిగా సేకరించే విషయంలో బీసీ కమిషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డా ఇ. నవీన్ నికోలస్, స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ సెక్రటరీ ప్రొ శ్రీరామ్ వెంకటేష్, రిజిస్ట్రార్, కాళోజి నారాయణరావు యూనివర్సిటి ఆఫ్ హెల్త్ సైన్సెస్ డా కె. నాగార్జున రెడ్డి, సెక్రెటరి, ఇంటర్‌మీడియట్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ కష్ణఆదిత్యలతో బీసీ కమిషన్ ఛైర్మన్ జి. నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి, మెంబర్ సెక్రెటరి బాల మాయా దేవి, ఐఏఎస్., గారు సవివరంగా చర్చించడం జరిగింది. సమావేశంలో డిప్యూటి డైరెక్టర్ యు. శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి కె. మనోహర్ రావు, ప్రత్యేక అధికారి కుమారి ఎన్. సునీత, సెక్షన్ ఆఫీసర్ జి. సతీష్ కుమార్, రీసెర్చ్ ఆఫీసర్ జి. లక్ష్మీనారాయణ మరియు తదితర అధికారులు కూడా పాల్గొన్నారు. బీసీ కమిషన్ ఛైర్మన్ మరియు అధికారులు రాష్ట్రంలో విద్యార్థుల డేటా సేకరించడంలో తీవ్రమైన జాప్యం జరుగుతున్నందున దీని ప్రాధాన్యతను గుర్తించి, సమాచారం సేకరించి, కమిషన్‌కు అందించాలని కోరడం జరిగింది. సమాచారం ఆధారంగా బీసీ విద్యార్థుల్లో ఏ కులానికి, ఏ వర్గానికి చెందినవారు విద్యకు దూరంగా ఉంటున్నారో గుర్తించి, వారిని ప్రోత్సహించే అవకాశం కలుగుతుందని వివరించి చెప్పడం జరిగింది. సమావేశానికి హాజరైన అధికారులందరు వెంటనే ఈ సమాచారాన్ని సేకరించి కార్యక్రమానికి స్వీకారం చుడతారని, ఈ సంవత్సరం మార్చి లోపల వివరాలు అందిస్తామని చెప్పడం జరిగింది. సెక్రెటరి, స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ మాట్లాడుతూ ఈ సంవత్సరం నుండే అడ్మిషన్స్‌లోనూ రాబోయే విద్యా సంవత్సరం నుండి జరిగే ప్రవేశ పరిక్షలోను కుల సంబంధిత సమాచారాన్ని కూడా సేకరించబోతున్నామని స్పష్టం చేయడం జరిగింది.

# స్కూళ్లల్లో పిల్లలతో వెట్టిపై వార్తా కథనాలు

## మానవహక్కుల కమిషన్ సుమోటో కేసు




**హైదరాబాద్,ఫిబ్రవరి 4:** విద్యార్థులే.. స్వీపర్లు అనే వార్తా కథనాన్ని ఆధారంగా తీసుకొని తెలంగాణ మానవ హక్కుల కమిషన్ సుమోటోగా విచారణ స్వీకరించింది. ఎయిడెడ్ పాఠశాలల్లో స్వీపర్లు అందుబాటులో లేకపోవడం కారణంగా, 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు విద్యార్థులను ఊడ్చడం, చెత్త మోసుకెళ్లడం, మెట్లు తుడవడం వంటి శుభ్రపరిచే మరియు ఇతర పనులు చేయించడంతో పాటు, తిరస్కరించిన విద్యార్థులను బెదిరించడం మరియు శారీరక శిక్షలు విధించడం జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయని కమిషన్ గమనించింది. ఇవి బాలల హక్కులకు తీవ్ర భంగం కలిగించడమే కాకుండా, విద్యా హక్కు చట్టం, 2009 మరియు బాలల సంరక్షణ మరియు రక్షణ చట్టం, 2015 నిబంధనలకు విరుద్ధమని కమిషన్ అభిప్రాయపడింది. తెలంగాణ ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి మరియు హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి వారల సవివర నివేదికలు 24వ తేదీలోపు సమర్పించవలసిందిగా ఆదేశించింది.

# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌నే గెలిపించండి

మొదటి పేజీ తరువాయి



మిర్యాలగూడ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ బీఫాం మీద పోటీ చేస్తున్న ఆడబిడ్డలకు కూడా ఆర్టీసీలో ఉచితంగా బస్సు ప్రయాణం కల్పించాం. సంక్షేమ పథకాల అమలులో ఎక్కడా వివక్ష చూపలేదు. రైతు రుణమాఫీ కింద 25.35 లక్షల మందికి రూ.21 వేల కోట్లు ఖర్చు చేశాం. రైతులకు గిట్టుబాటు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తున్నాం. రైతు భరోసా కింద రూ.6వేల చొప్పున రూ.9వేల కోట్లు ఇచ్చాం. మున్సిపల్ ఎన్నికలు ముగిశాక రైతు భరోసా నిధులు జమ చేస్తాం. దేశంలో అత్యధికంగా రైతుల కోసం రూ.1.10 లక్షల కోట్లు ఖర్చు చేశాం. ఏప్రిల్‌లో కొత్త బ్జడెట్‌లో లక్షలాది ఇళ్లు పేదలకు ఇస్తాం. పేదల ఆత్మగౌరవం పెంచే బాధ్యత తీసుకుంటాం. నల్గొండ జిల్లాపై కోపంతో ఎస్ఎల్‌బీసీని పక్కనపెట్టారు. ఎస్ఎల్‌బీసీ ఆగిపోతే మామ, అల్లుళ్లు దావతు చేసుకున్నారు. నల్గొండ ప్రజలు ఫ్లోరైడ్ నీళ్లు తాగడానికి కారణం బీఆర్ఎస్. రెండేళ్లలో పూర్తి చేసే లక్ష్యంతో ఎస్ఎల్‌బీసీ పనులు చేపట్టాం. కేసీఆర్‌కు పోలీసులు నోటీసు ఇస్తే.. తెలంగాణ జాతికి ఇచ్చినట్టు చెబుతున్నారని సీఎం విమర్శించారు. గత ప్రభుత్వం సంక్షేమ పథకాలను మార్చి, అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని సీఎం విమర్శించారు. సన్నబియ్యం పొందుతున్న లబ్దిదారులంతా కాంగ్రెస్‌ను ఆశీర్వదించాలని కోరారు. ముఖ్యంగా మున్సిపల్ ఎన్నికలు ముగిసిన వెంటనే రైతు భరోసా అందిస్తామని సీఎం హామీ ఇచ్చారు. మహిళలకు ఉచిత బస్సు పథకం నిజంగా వరంగా మారిందని, ఆర్టీసీ బస్సుల్లో టికెట్ లేకుండా ప్రయాణిస్తున్న మహిళలు కాంగ్రెస్‌కు ఓటేస్తే.. బిఆర్ఎస్ అడ్రస్ గల్లంతు అవుతుంది అంటూ వ్యాఖ్యానించారు. అలాగే ఇతర నాయకులకు కూడా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందుతుందని, సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి వివక్ష లేదని స్పష్టం చేశారు. 10 ఏళ్లపాటు అధికారంలో ఉన్న కేసీఆర్‌కు పేదవాళ్లకు ఇళ్లు ఇవ్వాలనే ఆలోచన రాలేదని సీఎం విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం డిమాండ్ ఉందని, రాబోయే బడ్జెట్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భారీగా నిధులు కేటాయించి పేదల ఆత్మగౌరవాన్ని కాపాడతామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం నల్లగొండ జిల్లా ప్రజలపై కోపంతో ఘాఒఃఅ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. ఘాఒఃఅ ప్రమాదంలో 8 మంది మృతి చెందితే మామ?అల్లుళ్లు సంబరాలు చేసుకున్నారని ఇంట్రెస్టింగ్ వ్యాఖ్యలు చేశారు. గంజి గతి లేని నాయకులు బెంజ్ కార్లు కొనుగోలు చేశారని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో మిగితా నేతలు డబ్బులు ఇస్తే తీసుకోండి, కానీ ఓటు మాత్రం కాంగ్రెస్‌కే వేయాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిందని సీఎం ఆరోపిస్తూ.. జాతిపిత ఎవరన్న ప్రశ్నకు సమాధానంగా, తెలంగాణ కోసం సర్వం త్యాగం చేసిన ప్రొఫెసర్ జయశంకర్‌నే జాతిపిత అని, తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీనే తెలంగాణ తల్లి అని స్పష్టం చేశారు. రెండేళ్లలో జరిగిన తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని చూసి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేయాలని సీఎం పిలుపునిచ్చారు. మరో ఎనిమిదేళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తం చేస్తూ, 'కాంగ్రెస్ గెలిస్తే పేదవారు గెలుస్తారు' అని సీఎం అన్నారు.

# తెలుగు చిత్ర పరిశ్రమకు పెద్దపీట

మొదటి పేజీ తరువాయి



ప్రజా గాయకుడు గద్దర్ అని అన్నారు. అందుకే గద్దర్ పేరు మీ ద సినిమా అవార్డులను ప్రారంభించి సినీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ప్రతిభ, పారదర్శకత ఆధారంగానే అవార్డులు ఇవ్వాలని జ్యూరీ సభ్యులకు సూచించారు. ఉగాది రోజు మార్చి 19న ఘనంగా అవార్డుల పంపిణీ జరగనుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఈ సమావేశంలో జ్యూరీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. కాగా, ఫిబ్రవరి 6 నుంచి గద్దర్ అవార్డుల స్క్రీనింగ్ పక్రియ ప్రారంభమవుతుంది. దేశవ్యాప్తంగా ఫిలిం ఇండస్ట్రీకి హైదరాబాదును కేంద్రంగా చేయాలన్న ఆలోచనతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని భట్టి విక్రమార్క అన్నారు. బాంబే, కలకత్తా, చెన్నై వంటి పట్టణాల్లో సినీ ఇండస్ట్రీ పెరగడానికి అంతగా అవకాశాలు లేవు, కానీ దేశంలో ఉన్న అన్ని భాషల ఇండస్ట్రీలను హైదరాబాద్‌లో విస్తరించడానికి సానుకూల అంశాలు అనేకం ఉన్నాయని తెలిపారు. సకల భాషల సినీ ఇండస్ట్రీ, హైదరాబాద్‌కు తరలి వస్తే రాష్ట్ర యువతకు, టెక్నీషియన్లు, రైటర్లు, డైరెక్టర్లకు ఉపాధి లభిస్తుంది. సినీ ప్రపంచ మార్కెట్‌కు హైదరాబాద్ కేంద్రంగా మారుతుందని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన బ్లూ ప్రింట్ ప్రభుత్వం తయారు చేస్తుందని చెప్పారు. గత ప్రభుత్వం దశాబ్ద కాలం పాటు సినిమా రంగానికి సంబంధించిన అవార్డుల విషయంలో నిర్లక్ష్యం వహించి వదిలేస్తే, సమాజంలో అత్యంత ప్రభావం చూపే సామాజిక పరివర్తన తీసుకొచ్చే సినీ రంగాన్ని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అవార్డులు ఇచ్చి తిరిగి ప్రోత్సహించడం ప్రారంభించిందని వివరించారు.సమాజం కోసం కళల ద్వారా తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప మహానుభావుడు గద్దర్ అని డిప్యూటీ సీఎం కొనియాడారు. తెలంగాణ అంటే కళలు, విప్లవం, ప్రశ్నించడం, సున్నిత మనసుతో, ప్రేమానురాగాలతో కూడినదని, తెలంగాణ కళలు, సంస్కృతిని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి గద్దర్ అని పేర్కొన్నారు. అందుకే వారి పేరు మీద గత సంవత్సరం నుంచి సినిమా అవార్డులు ఇవ్వడం ప్రారంభించి, సినీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ప్రతిభ, పారదర్శకతలే ప్రమాణంగా సినిమా అవార్డుల ఎంపిక ఉంటుందని, గత సంవత్సరం జ్యూరీ సభ్యులు అవార్డుల ఎంపికను గొప్పగా నిర్వహించి, అభినందనలు పొందిన విషయాన్ని డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా గుర్తు చేశారు. సినీ రంగ ప్రముఖులకు ఉన్న అనుభవాన్ని, నిబద్ధతను, సినిమా రంగం పట్ల వారికున్న అభిమానాన్ని దృష్టిలో పెట్టుకొని ఎఫ్ డి సి ద్వారా అందరితో సంప్రదింపులు జరిపి జ్యూరీ సభ్యులను ఎంపిక చేశారని, ప్రభుత్వ నుంచి కావలసిన సహకారాన్ని పూర్తిస్థాయిలో అందజేస్తామని తెలిపారు. ప్రతి పని సమాజానికి ఉపయోగపడాలి, ప్రజలకు జవాబు దారిగా ఉండాలన్న లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. గద్దర్ అవార్డుకు ఎంపిక చేసే సినిమాలో కమర్షియల్ అంశంతో పాటు సామాజిక సందేశం తప్పనిసరిగా ఉండేలా జాగ్రత్త తీసుకుంటే రాబోయే రోజుల్లో సమాజంలో మంచి సినిమాలను ప్రోత్సహించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. ఈనెల 6 నుంచి గద్దర్ సినిమా అవార్డుల స్క్రీనింగ్ కార్యక్రమం ప్రారంభమవుతుందని, 19న ఉగాది పండుగ రోజు గద్దర్ అవార్డుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ఈ సమావేశంలో జ్యూరీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్తు కనెక్షన్లకు కొత్త రూల్స్



**తెలంగాణలో కొత్త విద్యుత్ కనెక్షన్ల జారీ విధానంలో కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఈ మేరకు కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ మార్పులు గురువారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి రానున్నాయి.**

## మార్గదర్శకాలు విడుదల చేసిన ఈఆర్సీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 4:** రాష్ట్రంలో కొత్త విద్యుత్తు కనెక్షన్ల జారీకి ఈఆర్సీ (విద్యుత్తు నియంత్రణ మండలి) నూతన మార్గదర్శకాలు విడుదల చేసింది. ఇది వరకు విద్యుత్తు లైన్ నుంచి వినియోగదారుడి ఇంటి వరకు లైన్ వేసేందుకయ్యే వ్యయాన్ని వినియోగదారులే భరించాల్సి వచ్చేది. విద్యుత్తు స్తంభాలు, లైన్ల ఏర్పాటు కోసం దూరాన్ని బట్టి అధికారులు అంచనాలు రూపొందించే వారు. వాటి ఆధారంగా వినియోగదారుల నుంచి చార్జీలు వసూలు చేసేవారు. కానీ, ఇక నుంచి ఎలాంటి అదనపు చెల్లింపులు ఉండవు.

వ్యవసాయ కనెక్షన్లకు సంబంధించి అన్ని లోడ్‌లకు కిలోవాట్‌కు రూ.1,000 మాత్రమే వసూలు చేస్తారు. అయితే ఈ మార్గదర్శకాల పేరిట టర్న్‌కీ విధానాన్ని ఎత్తివేసే కుట్ర జరుగుతున్నదని, దీంతో అన్ని పనులు డిస్కమ్ అధికారుల చేతుల్లోకి వెళ్తాయని కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే అవసరమైన మెటీరియల్, ట్రాన్స్‌ఫార్మర్లను డిస్కమ్‌లు అందించలేకపోతున్నాయి. ఈ నేపథ్యంలో మొత్తం పనులు డిస్కమ్ అధికారులే చేయడం సాధ్యపడదని కాంట్రాక్టర్లు చెప్తున్నారు. నూతన విధానాన్ని నిరసిస్తూ పోరాటానికి దిగుతామని విద్యుత్తు కాంట్రాక్టర్ల జేఏసీ చైర్మన్ కందుకూరి శ్రీనివాస్ స్పష్టం చేశారు.

## కొత్త చార్జీలు ఇలా..

- **ఎల్‌టీ-1 క్యాటగిరీ వినియోగదారులు** ఒక కిలోవాట్ విద్యుత్తు కనెక్షన్‌కు సర్వీస్ లైన్ చార్జి కింద రూ.500 చెల్లిస్తే సరిపోతుంది. 1 నుంచి 5 కిలోవాట్లలోపు కనెక్షన్‌కు రూ.500తోపాటు ప్రతి కిలోవాట్‌కూ రూ.600 చొప్పున చెల్లించాలి. 5 నుంచి 20 కిలోవాట్లలోపు కనెక్షన్‌కు రూ.2,900 కనీస చార్జీతోపాటు ఒక్కో కిలోవాట్‌కూ రూ.1,500 చొప్పున, 20 కిలోవాట్లు దాటితే ప్రతి కిలోవాట్‌కూ రూ.10వేల చొప్పున చెల్లించాల్సి ఉంటుంది.
- **ఎల్‌టీ -2 క్యాటగిరీ వినియోగదారులు** ఒక కిలోవాట్‌కు రూ.1,000, ఐదు కిలోవాట్లకు రూ.1,000తోపాటు అదనంగా ప్రతి కిలోవాట్‌కూ రూ.1,200 చొప్పున, 20 కిలోవాట్లకు రూ.5,800తోపాటు అదనంగా ప్రతి కిలోవాట్‌కూ రూ.2 వేల చొప్పున చెల్లించాలి.
- **20 కిలోవాట్లు దాటితే వినియోగదారులు** ప్రతి కిలోవాట్‌కు రూ.10 వేలు చెల్లించాలి.
- **ఎల్‌టీ-3 క్యాటగిరీలో** పరిశ్రమల యజమానులు 20 కిలోవాట్లకు రూ.40 వేలు, 20 కిలోవాట్లు దాటితే ప్రతి కిలోవాట్‌కూ రూ.10 వేల చొప్పున చెల్లించాల్సి ఉంటుంది.

# జర్నలిస్టుల కుటుంబాలకు ప్రభుత్వం అండ

**హైదరాబాద్, ఫిబ్రవరి 4 :** వృత్తిరీత్యా అక్షరాన్నే ఆయుధంగా మలచుకుని పనిచేస్తూ అకాల మరణం చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు ప్రభుత్వం పూర్తి భరోసా కల్పిస్తుందని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. బుధవారం నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమీ ఆడిటోరియంలో మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు ఆర్థిక సాయం చెక్కుల పంపిణీ మరియు ప్రముఖ జర్నలిస్టుల జీవిత విశేషాలతో కూడిన చిరుపుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావుతో కలిసి ఆయన ఈ వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ, జర్నలిస్టుల సంక్షేమ నిధి నుంచి ఒక్కో కుటుంబానికి లక్ష రూపాయల ఆర్థిక సాయంతో పాటు, ఐదేళ్ల పాటు పెన్షన్ సదుపాయం కల్పించడం అభినందనీయమన్నారు. ఎలక్ట్రానిక్ మీడియాలో ఎన్ని మార్పులు వచ్చినా, వార్తాపత్రికలు చదివితేనే తనకు సంతృప్తి కలుగుతుందని ఆయన తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. అనంతరం కె. కేశవరావు మాట్లాడుతూ, ప్రముఖ జర్నలిస్టుల చరిత్రను మోనోగ్రాఫ్స్ (చిరుపుస్తకాలు) రూపంలో తీసుకురావడం గొప్ప విషయమని, ఇది భావితరాల పాత్రికేయులకు స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. సోషల్ మీడియాపై నియంత్రణ ఎవరితరం కాదని, అయితే జర్నలిస్టులు వర్క్‌షాపుల ద్వారా దీనిపై చర్చించి సానుకూల మార్పుకు కృషి చేయాలని సూచించారు. మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, అకాల మరణం చెందిన 18 మంది జర్నలిస్టుల కుటుంబాలకు లక్ష రూపాయల చొప్పున, ప్రమాదానికి గురైన ఒక జర్నలిస్టుకు 50 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందజేసినట్లు వెల్లడించారు. ఇదే వేదికపై అబిద్ అలీఖాన్, పొత్తూరి వెంకటేశ్వరరావు, ఎ.బి.కె. ప్రసాద్, జి.ఎస్. వరదాచారి వంటి పదిమంది ప్రముఖ పాత్రికేయుల జీవిత విశేషాలపై అకాడమీ ముద్రించిన పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు మరియు పలువురు సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.



# ముస్లింల ఓట్ల కోసం కాంగ్రెస్ ఆరాటం

- ఎస్సీ ఎస్టీ నిధులు మైనార్టీలకు మళ్లింపు
- నిజాం నిరంకుశానికి అంకుశం వేసిన గడ్డ ఇదే
- ఎన్నికల హామీలను తుంగలో తొక్కిన సీఎం రేవంత్
- మహబూబ్‌నగర్ ప్రచారంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్



**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 4:** తెలంగాణలో ప్రస్తుతం రాజకీయాలు అత్యంత దయనీయ స్థితికి చేరుకున్నాయని, సీఎం రేవంత్‌రెడ్డి మన దేశ సంస్కృతి, సంప్రదాయాలపై దాడి చేస్తున్నారని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సిన్హా తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఆయన తీవ్రంగా ఎండగట్టారు. బుధవారం మహబూబ్‌నగర్‌లోని ఎంవీఎస్ కాలేజ్ గ్రౌండ్‌లో నిర్వహించిన బీజేపీ విజయ సంకల్ప సమ్మేళనంలో నితిన్ నబీన్ ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ అంటే ముస్లింల పార్టీ అని స్వయంగా ముఖ్యమంత్రే ప్రకటించారని గుర్తు చేశారు. ముస్లిం ఓటు బ్యాంకు కోసం కాంగ్రెస్ పార్టీ అన్ని ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన బడ్జెట్ నిధులను మైనార్టీలకు బదలాయించారని ఆరోపించారు. రాష్ట్రంలో వక్ఫ్ బోర్డు వద్ద 77 వేల ఎకరాల భూమి ఉందని గుర్తు చేస్తూ, ముస్లింల ఓట్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా మొగ్గు చూపుతోందన్నారు. కాంగ్రెస్ నేతలు ముస్లిం ఓటు బ్యాంకు కోసం ఆరాటపడుతున్నారని వ్యాఖ్యానించారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర కలిగిన గడ్డ ఇదేనని, హైదరాబాద్ విముక్తి కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారని నితిన్ నబీన్ గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీల అమలులో పూర్తిగా విఫలమైందన్నారు. రైతు భరోసా, రుణమాఫీ, వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని విమర్శించారు. ఎస్సీలు, ఆదివాసీలు, బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. అభివృద్ధి పనులకు, బిల్లుల మంజూరుకు ఆర్ఆర్ ట్యాక్స్ కట్టాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆరోపించారు. అవినీతి, కమిషన్ల ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలించాలని పిలుపునిచ్చారు. అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే బీజేపీని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో అనేక హిందూ దేవాలయాలను కూల్చారని నితిన్ నబీన్ మండిపడ్డారు. ఆలయాలపై రాజకీయం చేస్తే బీజేపీ చూస్తూ ఊరుకోదని, అవసరమైతే ప్రాణ త్యాగానికైనా సిద్ధమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం విధానాలు మార్చుకోకపోతే ఎక్కువ రోజులు అధికారంలో ఉండబోదని హెచ్చరించారు. ప్రధాని నరేంద్ర మోదీ మహిళలను లక్షాధికారులను చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నారని, కానీ రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను పూర్తిగా మోసం చేసిందన్నారు. రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలపై జరుగుతున్న అన్యాయాలను ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలని కార్యకర్తలకు సూచించారు. తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం సముచితంగా నిధులు మంజూరు చేస్తోందని తెలిపారు. రైల్వే అభివృద్ధికి రూ.5,400 కోట్లకు పైగా కేటాయించిందని, మూడు హైస్పీడ్ రైల్ కారిడార్లు, రెండు పారిశ్రామిక కారిడార్ల నిర్మాణం జరుగుతోందన్నారు. ప్రపంచవ్యాప్తంగా మోదీ ప్రభుత్వానికి ఆదరణ పెరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ఒక్క హామీ కూడా అమలు చేయలేదని, ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఇంకేమీ చేయలేదన్నారు. బీఆర్ఎస్ పాలనలోనూ పాలమూరుకు అన్యాయం జరిగిందని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి మాటలు కోటలు దాటుతాయని, చేతలు మాత్రం గడప కూడా దాటవని ఎద్దేవా చేశారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు మాట్లాడుతూ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు బీజేపీని చూసి భయపడుతున్నాయని అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు లోపించాయని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే అభివృద్ధి జరుగుతుందని, కాంగ్రెస్, బీఆర్ఎస్ గెలిస్తే పన్నులు పెరుగుతాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, ఎంపీలు డీకే అరుణ, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితర బీజేపీ నేతలు పాల్గొన్నారు.



# పవన్.. ఆంధ్రా రాజకీయాలు చూసుకో

## తెలంగాణను అవమానించిన నీకు ఇక్కడేం పని

## టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఘాటుగా వ్యాఖ్యలు

**హైదరాబాద్,ఫిబ్రవరి 4 :** పవన్ ఒక ఆంధ్ర నాయకుడని, ఆయన తెలంగాణ వ్యతిరేకి అని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ మేరకు పవన్ కల్యాణ్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. పవన్ తన రాజకీయాలను ఆంధ్రాలోనే చేసుకోవాలని, తెలంగాణలో ఆయన ప్రచారం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని స్పష్టం చేశారు. తెలంగాణలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి మద్దతుగా పవన్ కల్యాణ్ ప్రచారం చేస్తారనే వార్తలు వస్తున్న నేపథ్యంలో మహేశ్ గౌడ్ ప్రాధాన్యత సంతరించుకున్నాయి. గతంలో పవన్ తెలంగాణ గురించి చాలా నీచంగా మాట్లాడారు. బీజేపీ నేతలు పవన్ కల్యాణ్‌ను భిక్షాం దేహీ అని అడిగారు' అని ఆయన ఎద్దేవా చేశారు. గతంలో పవన్ తెలంగాణ గురించి చాలా నీచంగా మాట్లాడారని, అలాంటి వ్యక్తి మాటలు విని ఇక్కడి ప్రజలు ఓట్లు వేయరని అన్నారు. ఆయన మాటలను ఎవరూ విశ్వసించరని, ఆయన ప్రభావం తెలంగాణ రాజకీయాలపై శూన్యమని మహేష్ గౌడ్ స్పష్టం చేశారు. గతంలో తెలంగాణ రాష్ట్రం గురించి, తెలంగాణ వ్యక్తుల గురించి, భాష, సంస్కృతి గురించి దారుణంగా మాట్లాడారని మండిపడ్డారు. అందుకే పవన్ ను దిష్టి కల్యాణ్ అని అంటామని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తెలంగాణ ప్రజలు అభివృద్ధి, సంక్షేమం కోరుకుంటున్నారుని.. కాంగ్రెస్ ప్రభుత్వం వారికి సంక్షేమం, అభివృద్ధి ఇస్తుందని అన్నారు. అందుకే రానున్న మున్సిపల్ ఎన్నికల్లో 90 శాతానికిపైగా మున్సిపాలిటీలు కాంగ్రెస్ గెలుచుకునే అవకాశం ఉందన్నారు. ఆ భయంతో పవన్ కల్యాణ్ లాంటి సినీ తారలను బీజేపీ నాయకులు అడుక్కునే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. తెలంగాణలో పవన్ కల్యాణ్ ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని.. ఆంధ్రాలో రాజకీయాలు చేసుకుంటే మంచిదని పీసీసీ చీఫ్ సూచించారు.

# జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కు క్లీన్ చిట్

## పార్టీ మారిన దాఖలాలు లేవన్న స్పీకర్

## స్పీకర్ తీర్పును స్వాగతించిన సంజయ్

## తాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేగానే ఉన్నాని వెల్లడి





**హైదరాబాద్, ఫిబ్రవరి 4:** జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ క్లీన్‌చిట్ ఇచ్చారు. సంజయ్ పార్టీ మారినట్లు ఆధారాలు లేవని, ఆయన్ను బీఆర్ఎస్ ఎమ్మెల్యేగానే పరిగణిస్తున్నామని స్పీకర్ తీర్పు ఇచ్చారు. దీనికి సంబంధించిన గెజిట్‌ను విడుదల చేసే అవకాశం ఉంది. సంజయ్‌పై అనర్హత కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. ఇక, పార్టీ ఫిరాయిపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న పది మంది ఎమ్మెల్యేలలో ఇప్పటికే ఏడుగురికి స్పీకర్ క్లీన్‌చిట్ ఇచ్చిన విషయం తెలిసిందే. సంజయ్ సహా ఎనిమిది మంది ఎమ్మెల్యేలపై దాఖలైన పిటిషన్లను కొట్టివేసిన స్పీకర్.. కడియం శ్రీహరి, దానం నాగేందర్‌పై దాఖలైన పిటిషన్ల విచారణను ఫిబ్రవరి 19కి వాయిదా వేశారు. తాజాగా జగిత్యాల ఎమ్మెల్యేకు కూడా క్లిన్ చిట్ ఇచ్చేశారు స్పీకర్. స్పీకర్ ఇచ్చిన తీర్పుపై జగిత్యాల ఎమ్మెల్యే స్పందిస్తూ... ' నేను బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేనే. బీఆర్ఎస్ పార్టీలోనే గెలిచా. బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే అని అఫిడవిట్ ఇచ్చా. అసెంబ్లీలో బీఆర్ఎస్ పార్టీ బిల్లులు ప్రవేశపెట్టి, విప్ జారీ చేస్తే నేను మద్దతు ఇస్తా. నేనెప్పుడూ బీఆర్ఎస్ పార్టీని, అధిష్టానాన్ని విమర్శించలేదు. స్థానిక బీఆర్ఎస్ నాయకత్వం నాకు దూరంగా ఉంది. నాది ఎలక్షన్ కోసం కాదు.. అభివృద్ధి కోసం ఆరాటం. జగిత్యాల అభివృద్ధి కోసం సీఎం, ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నా' అని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. నా జీతం నుంచి నెలకు రూ.5 వేలు బీఆర్ఎస్ పార్టీకి కట్ అవుతున్నాయి. నేను బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే అని అఫిడవిట్ ఇచ్చానని సంజయ్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తూ బీఆర్ఎస్‌లోనే ఉన్నానని కడియం శ్రీహరి చెప్పడం హాస్యాస్పదమని ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ వ్యాఖ్యానించారు. కడియం నీతులు చెప్పడం ఆపు. నువ్వు కాంగ్రెస్‌లో చేరావని స్పీకర్ ముందు అంగీకరించు. దిల్లీ వెళ్లి రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకొని ఇప్పుడు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. కాలయాపన చేసి అనర్హత నుంచి కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. ఆధారాలు లేవని ఎనిమిది మందికి స్పీకర్ క్లీన్‌చిట్ ఇచ్చారు' అని వివేకానంద తెలిపారు.

# తెలంగాణ కోసం ఏనాడైనా రేవంత్ పోరాడారా

## మాజీమంత్రి హరీష్ రావు ప్రశ్న



**మెదక్,ఫిబ్రవరి 4:** తెలంగాణ కోసం తాము మంత్రి పదవులు త్యాగం చేశామని.. సీఎం రేవంత్‌రెడ్డి ఎప్పుడైనా రాష్ట్రం కోసం పోరాడారా? అని భారత రాష్ట్రసమితి ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మెదక్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు ఏ ముఖం పెట్టుకుని మెదక్ ప్రజలను ఓట్లు అడుగుతున్నారని ధ్వజమెత్తారు. 'మెదక్ నుంచి సిద్దిపేటకు ఆఫీసులను నేను తరలించానని అంటున్నారు. నేను తరలించిన ఆఫీస్ పేరు చెబితే నేనే తెచ్చిస్తా. రేవంత్‌రెడ్డి ఒక్కటంటే.. నేను రెండంటాను. ఆయన మంచి మాట్లాడితే.. మేము మంచే మాట్లాడతాం. ఆయన భాష జారితే.. మేము కూడా జారాల్సి వస్తుంది. రైతు భరోసా సొమ్ము ఈనెల 11లోపు ఇవ్వకపోతే కర్షక ఆగ్రహానికి గురికాక తప్పదు' అని హరీశ్‌రావు అన్నారు.

# స్పీకర్ తీరు రాజ్యాంగానికే గొడ్డలి పెట్టు

- కళ్లముందు కనిపిస్తున్నా సాక్ష్యాలు లేవంటే ఎలా
- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కు క్లీన్‌చిట్‌పై కెటిఆర్ ఆగ్రహం



**హైదరాబాద్,ఫిబ్రవరి 4 :** ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లను స్పీకర్ వరుసగా కొట్టివేస్తున్న తీరు రాజ్యాంగానికే గొడ్డలిపెట్టని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రే స్వయంగా జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్‌కి కండువా కప్పి కాంగ్రెస్‌లో చేర్చుకున్న ఫోటోలు, వీడియోలు కళ్లముందు కనిపిస్తున్నా ఆధారాలు లేవని అనర్హత పిటిషన్‌ను తిరస్కరించడం అర్థరహితం అన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లను స్పీకర్ కొట్టేయడంపై కేటీఆర్ స్పందించారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. అటు సుప్రీంకోర్టు తీర్పును, ఇటు ప్రజాతీర్పును కాలరాసి గోడదూకిన ఎమ్మెల్యేలపై రాజ్యాంగబద్ధంగా చర్య తీసుకోకుండా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నడుచుకోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే. ఓవైపు జగిత్యాలలో మున్సిపల్ ఎన్నికల వేళ అసలు కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డి దుమ్మెత్తిపోస్తున్న తరుణంలోనే ఫిరాయింపు ఎమ్మెల్యేకు క్లీన్ చిట్ ఇవ్వడం స్పీకర్ పదవికున్న గౌరవాన్ని దెబ్బతీయడమే. పంచాయతీ ఎన్నికల్లో తగిలిన ఘోరమైన ఎదురుదెబ్బతో కోలుకోని కాంగ్రెస్ పార్టీ బైఎలక్షన్స్ అంటే భయపడుతోందని అర్థమైపోయింది. మున్సిపల్ ఎన్నికల్లోనూ ముఖ్యమంత్రి వైఫల్యాలు, మోసాలపై పట్టణ ప్రజల్లో పెద్దఎత్తున వెల్లువెత్తుతున్న ఆగ్రహాన్ని చూసి రేవంత్ సర్కారు వణికిపోతోందని తేలిపోయింది. పార్టీ ఫిరాయింపుల సూత్రధారి ఢిల్లీకి పంపే మూటలకు ఆశపడి మౌనం వహిస్తున్న రాహుల్ గాంధీకి ఇకనుంచి రాజ్యాంగాన్ని పట్టుకుని తిరిగే నైతిక హక్కు లేదు. పట్టపగలే పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించినా ఒక్కరిపై కూడా చర్య తీసుకోకుండా సీఎం నడిపిస్తున్న ఈ వికృత రాజకీయ క్రీడకు ప్రజాక్షేత్రంలోనే గుణపాఠం తప్పదని పేర్కొన్నారు.

# బీజేపీ జెండా ఎగరేస్తాం

## ఎన్నికల ప్రచారంలో కేంద్రమంత్రి బండి సంజయ్

## పోలీసులు నిష్పక్షపాతంగా ఉండాలని హితవు



**వేములవాడ,ఫిబ్రవరి 4 :** వేములవాడ మున్సిపాలిటీని భాజపా కైవసం చేసుకోవడం ఖాయం అని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. నిధులిచ్చేది మోదీ... తెచ్చేది నేను. మరి కాంగ్రెస్, భారాసకు ఎందుకు ఓట్లేయాలి? కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో ఒక్కటైనా అమలు చేశారా? అని ప్రశ్నించారు. సిరిసిల్ల, వేములవాడలో జరిగిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో బండి సంజయ్ పాల్గొన్నారు. మహిళలకు రూ.2500, తులం బంగారం, స్కూటీ ఇచ్చారా? అవ్వాతాతలకు రూ.4 వేల పెన్షన్ ఇచ్చారా? నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేశారా? నిరుద్యోగ భృతి ఇచ్చారా? పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజల రక్తాన్ని పీల్చి పిప్పి చేశారు. కేంద్రం నిధులిస్తే కమీషన్లు దండుకున్నారు. మళ్లీ దొంగ హామీలతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు మీ ముందుకు వస్తున్నారు. ఎందుకు ఓటేయాలంటూ ఆ రెండు పార్టీలను నిలదీయండని బండి సంజయ్ పిలుపునిచ్చారు. వేములవాడ ఎమ్మెల్యే భాజపా కార్యకర్తలను బెదిరిస్తుంటే పోలీసులు వంతపాడతారా కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్ధతి మార్చుకోకపోతే వేములవాడలోనే కూర్చుంటా.. మీ డీజీపీ, ఎస్పీని ఇక్కడికి రప్పించాల్సి ఉంటుంది అంటూ.. సిరిసిల్ల పోలీసులను కేంద్ర మంత్రి బండి సంజయ్ హెచ్చరించారు. ఈ సందర్భంగా పోలీసుల తీరుపై విరుచుకుపడ్డారు. మా రిక్వెస్ట్‌ను చేతగానితనంగా భావిస్తున్నారా? ఎన్నికలు ప్రశాంతంగా జరగాలని లేదా అని అన్నారు. సిరిసిల్ల సీఐ క్రిష్ణ.. భాజపా నాయకులు, సిబ్బందిపై దాడి చేసి ఓవరాక్షన్ చేశారని బండి సంజయ్ మండిపడ్డారు. తక్షణమే విధుల్లోంచి తప్పించకపోతే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు.

# తెలంగాణలో పవన్ కల్యాణ్ ప్రచారం

**హైదరాబాద్, ఫిబ్రవరి 4:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ త్వరలో తెలంగాణలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. ఈ నెల 7,8 తేదీల్లో బీజేపీకి మద్దతుగా పవన్ ప్రచారం చేయనున్నారు. ఈ మేరకు బీజేపీ నేతలకు హామీ ఇచ్చారు. మంగళవారం కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ తెలంగాణ శాఖ అధ్యక్షుడు రామచందర్‌రావు.. పవన్ కల్యాణ్‌ను కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మున్సిపల్ ఎన్నికలు సహా పలు కీలక అంశాలపై ముగ్గురు నేతలు చర్చించారు. ఈ సందర్భంగా బీజేపీ తరఫున ప్రచారంలో పాల్గొనాలని కిషన్ రెడ్డి, రామచందర్ రావు.. పవన్‌ను కోరారు. ఇందుకు పవన్ కల్యాణ్ సానుకూలంగా స్పందించారు. ఈ విషయాన్ని రామచందర్ రావు స్వయంగా వెల్లడించారు. మంగళవారం ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. 'కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి పవన్ కల్యాణ్ గారిని కలవడం గౌరవంగా భావిస్తున్నా. తెలంగాణలో త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికలతో సహా ముఖ్యమైన అంశాలపై విస్తృతంగా, అర్థవంతమైన చర్చలు జరిపాము. పవన్ కల్యాణ్ భారతీయ జనతా పార్టీకి పూర్తి మద్దతు ప్రకటించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ తరఫున ప్రచారం చేయడానికి అంగీకరించారు' అని తెలిపారు. కాగా, రాష్ట్రంలోని ఏడు కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల పరిధిలో ఫిబ్రవరి 11న ఎన్నికల పోలింగ్ జరగనుంది. ఆ తర్వాత 13న ఫలితాలను వెల్లడించనున్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 243, తెలంగాణ మున్సిపాలిటీల చట్టం 2019 ప్రకారం ఈ ఎన్నికల ప్రక్రియ కొనసాగనుంది. ఈ ఎన్నికల్లో మొత్తం 52.43 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ సారి మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ, జనసేన కలిసి పోటీ చేసే అవకాశం కనిపిస్తోంది. బీజేపీ, జనసేన స్నేహపూర్వక పోటీ అంటూ ఈ మేరకు జనసేన పార్టీ ట్వీట్ చేసింది.

శేనార్తి మీడియా
మన యాస.. మన బలం
GENERAL NEWS
గురువారం
05-02-2026
SHENARTHI MEDIA



సంపాదకీయం

# గాడితప్పుతున్న పార్లమెంట్ సమావేశాలు!

పార్లమెంట్ సమావేశాలు గాడి తప్పాయి. సభలో చర్చలకు ఆస్కారం లేదు. రూల్స్ పాటించడం లేదు. అటు ప్రభుత్వం, ఇటు విపక్షం రెండు పక్షాలు కూడా పంతాలకు పోతూ ప్రజాధనాన్ని, సమయాన్ని వృధా చేస్తున్నాయి. పోడియంలోకి దూసుకుని రావడం, అరవడం, కేకలు పెట్టటం సభనుంచి వెళ్లిపోవడం ఏ రకమైన ప్రజాస్వామ్యమో కాంగ్రెస్ చెప్పాలి. గత మూడు రోజులుగా ఇదే తంతు సాగుతోంది. గతంలో లాగానే ఈ బడ్జెట్ సమావేశాల్లో కూడా ఇది కనిపిస్తోంది. సమస్యలను చర్చించడానికి ఉన్న పద్దతులను వదిలేసి కాంగ్రెస్ సభాస్తంభన అస్త్రాన్ని ఉపయోగించుకుంటోంది. కేవలం సభా కార్యక్రమాలకు అవరోధం లేదా, అంతరాయం కల్పించడం ద్వారా సభా కార్యక్రమాలు సాగకుండా చేస్తోంది. గతంలో అనేక సందర్భాల్లో ఇదే పద్దతిని అవలంబించింది. సాధారణంగా బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రపతి ప్రసంగంపై చర్చ, ఆ తరవాత బడ్జెట్‌పై చర్చలు ప్రధానంగా ఉంటాయి. ఈ సందర్భంగా ఏదేని అంశాన్ని చర్చించే అవకాశం ఉంటుంది. కానీ కాంగ్రెస్ చర్చ కోరుకోవడం లేదు. కేవలం రచ్చనే కోరుకుంటోంది. దీంతో ప్రచారం వస్తుందన్న ధీమాలో ఉంది. ఇకపోతే ప్రధానంగా మాజీ ఆర్మీ చీఫ్ నరవణె పుస్తకం ఆధారంగా చైనా సరిహద్దుల్లో పరిస్థితులు, అమెరికాతో ఒప్పందం పైనా చర్చించాలని రాహుల్ లేదా కాంగ్రెస్ కోరుకుంటోంది. అయితే దీనికి కొన్ని రూల్స్ ఉన్నాయి. ఈ మేరకు చర్చకు ప్రతిపాదించి, చర్చ చేయవచ్చు. ఇకపోతే అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై ప్రభుత్వం ప్రకటన చేయకముందే కాంగ్రెస్ యాగీ చేస్తోంది. ఇంతకాలం ట్రేడ్ డీల్ జరగనందుకు మోడీపై దుమ్మెత్తి పోసారు. మన సమస్యలపై పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పుడు ట్రేడ్ డీల్ కుదరగానే అదేదో ద్రోహం జరిగినట్లుగా లేదా మోడీ అమెరికాకు అమ్ముడు పోయినట్లుగా ఆరోపిస్తున్నారు. పార్లమెంటులో ప్రభుత్వం ప్రకటనకు సిద్దంగా ఉన్న సమయంలోనే సమావేశాల్లో రచ్చ చేయడం కాంగ్రెస్÷-కే చెల్లింది. అమెరికా -భారత్ మధ్య వాణిజ్య ఒప్పందం జరిగిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్సోషల్ మీడియాలో ప్రకటించటం, ఆ తరువాత మన ప్రధాని మోడీ అవునన్నట్టుగా ట్రంప్‌నకు ధన్యవాదాలు చెప్పుకోవటం జరిగింది. భారతదేశ ఆత్మగౌరవాన్ని, ఆర్థిక ప్రయోజనాలను పరిరక్షించేదిగా ఉన్నదీ లేనిదీ చర్చిస్తే తెలుస్తుంది. ఏకపక్షంగా అదనపు సుంకాలు విధించటం దగ్గర నుంచి మన ఆర్థిక వ్యవస్థను అవహేళన చేయటం దాకా ట్రంపు సాగించిన బెదిరింపులపై భారత్ ఓపిక పట్టింది. యూరోపియన్ యూరియన్‌తో ఒప్పందం కుదరగానే ఇప్పుడు ట్రంప్ దిగివచ్చారు. అయితే దీనిని సానుకూలంగా చూడాల్సి విపక్షాలు ప్రభుత్వం లొంగిపోయిందని విమర్శలకు దిగడం ఎంతవరకు సమంజసమో సమాధానం చెప్పాల్సిందే! దేశ అవసరాలను బట్టి, అవకాశాలను బట్టి మనం వివిధ దేశాలతో వాణిజ్య ఒప్పందాలు చేసుకోవటం సాధారణ విసయం. కాంగ్రెస్ అధికారంలో ఉన్నా ఇదే చేస్తుంది. నిజానికి అహంకారపూరితంగా అమెరికా అధ్యక్షుడు బెదరింపు ధోరణితో వ్యవహరించారు. మన దేశం చౌకగా రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుంటే- వద్దని అడ్డం పడ్డాది. మన దేశ రైతాంగాన్ని దారుణంగా దెబ్బ తీసేవిధంగా తన వ్యవసాయోత్పత్తులను దిగుమతి చేసుకోవాలని ఒత్తిడి తెచ్చారు. మనం ఏయే దేశాలతో వాణిజ్య సంబంధాలను కలిగి ఉండాలో, కూడదో అదే నిర్దేశించాలని చూశారు. . ఇలాంటి తలబిరుసు పెత్తనానికి భారత్ ఎట్టి పరిస్థితుల్లోనూ తలవొంచకూడదని నిర్ణయించి, ఇంతకాలం ట్రేడ్ డీల్‌ను పక్కన పెట్టింది. పాకిస్తాన్-ఇండియా యుద్ధాన్ని తానే ఆపానని ట్రంప్ అనేకసార్లు ప్రకటించుకున్నా, భారత్‌పై సుంకాలను భారీగా విధించినా, అక్రమ వలసల పేరిట భారతీయులకు సంకెళ్లు వేసి, దేశంలో దించిపోయినా- భారత్ ఓపిక పట్టింది. ఇప్పుడు కూడా ట్రంప్ ప్రకటించేదాకా ఒప్పందంపై మనం ముందుకు రాలేదు. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి ఎన్నికయ్యాక- తన దారిలోకి రాని దేశాలపై ఎడాపెడా సుంకాలు విధించటం ఒక వ్యూహంగా ఎంచుకున్నాడు. కెనడా, బ్రిటన్, దక్షిణ కొరియా వంటి మిత్రదేశాలపైనా, రష్యా, చైనా వంటి పోటీ దేశాలపైనా విరుచుకుపడ్డాడు. సుంకాల విధింపుతో ఆయా దేశాల వాణిజ్యానికి తాత్కాలికంగా నష్టం కలిగించారు. అయితే ధరలు పెరిగి అమెరికా పౌరులకు కూడా అంతే సమస్య ఎదు-రవుతుంది. దీంతో, ట్రంప్ దూకుడుకు వ్యతిరేకంగా అమెరికాలోనూ పెద్దఎత్తున నిరసనలు వ్యక్తమయ్యాయి. సుంకాలు ఎదుర్కొన్న అనేక దేశాలు సైతం అదే పద్ధతిలో సమాధానం చెప్పాయి. నీకు మేమంత దూరమో మాకు నువ్వూ అంతే దూరం అని సమాధానం ఇచ్చాయి. భారత్ కూడా అదే పద్దతిని అవలంబించింది. మోడీ ప్రభుత్వం ఏ మాత్రం లొంగుబాటుకు ఒప్పుకోలేదు. మనపట్ల అమెరికాలోనే సానుకూలత వ్యక్తం అయ్యింది. అమెరికాలో ఒత్తిడి తట్టుకోలేక ట్రంప్ భారత్‌తో ఓ రకంగా కాళ్ళ బేరానికి వచ్చాడని చెప్పుకోవాలి. అంతేగానీ భారత్ పరువు పోయిందని, మోడీ లొంగిపోయాడని విమర్శించే వారికి అంతర్జాతీయ వ్యవహారాలు తెలియవను కోవాలి. ఈ విషయంలో కాంగ్రెస్, కమ్యూనిస్టులు ముందున్నారు. ట్రంప్ బెదరింపులకు లొగివుంటే ఎప్పుడో ఒప్పందం ఖరారు అయ్యేది. అయితే ఇవన్నీ చర్చించాల్సిన అంశాలే. కాదని ఎవరూ అనడం లేదు. పార్లమెంటులో చర్చకు ముందే గలాభా సృష్టించడం ద్వారా కాంగ్రెస్ రాజకీయ పైత్యాన్ని చాటుకుంది. మోడీ ప్రకటన చేసే వరకు ఆగాలి. తాము కోరుకున్నట్లు ఇప్పుడే..ఈ క్షణమే చర్చ జరగాలని అనుకోవడం దుర్మార్గం తప్ప మరోటి కాదు. పార్లమెంటులో సమస్యలపై చర్చించకుండా, జారుకోవడం కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలకు పరాకాష్టగా చూడాలి.

# ఐదు నిముషాలకే లోక్‌సభ వాయిదా

- నరవణె పుస్తకంపై భయపడుతున్న ప్రభుత్వం
- కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ విమర్శలు





**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:** పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో యూరోపియన్ యూనియన్, అమెరికాతో చేసుకున్న ఒప్పందాల వివరాలను పార్లమెంటు ముందుంచాలని ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. దీంతో బుధవారం కూడా లోక్‌సభ ప్రారంభం అవ్వగానే ప్రతిపక్ష సభ్యులు ఈ ఒప్పందాలపై చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. ఈ పరిణామాలతో సభ ప్రారంభమైన ఐదు నిమిషాలకే మధ్యాహ్నం 12 గంటల వరకు స్పీకర్ వాయిదా వేశారు. మరోవైపు రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపై తీర్మానంపై ప్రధాని మోడీ మాట్లాడడనున్నారు. ఇకపోతే భారత సైన్యం మాజీ అధిపతి ఎంఎం నరవణె పుస్తకంలోని ఓ అంశంపై వివాదం కొనసాగుతోంది. దీనిపై తాజాగా కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ స్పందించారు. ఆ పుస్తకం చదివితే చైనా మన సరిహద్దుల్లోకి వచ్చినప్పుడు మన దేశ నాయకత్వం దానిపై ఎలా స్పందించిందనే విషయం బయటపడిపోతుందని ప్రభుత్వం భయపడుతోందన్నారు. అందుకే తమ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని ఈ విషయంపై పార్లమెంటులో మాట్లాడనీయకుండా చేస్తున్నారని ఆరోపించారు. పార్లమెంటు ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రియాంక ఈ వ్యాఖ్యలు చేశారు. భాజపా నాయకులు మాట్లాడేటప్పుడు కూడా పుస్తకాలు, పత్రికల గురించి ప్రస్తావిస్తార న్నారు. ఈ సందర్భంగా గతంలో ప్రభుత్వమైనా, ప్రతిపక్షమైనా తమ అభిప్రాయాలను నిర్భయంగా వ్యక్తం చేసేవి. కానీ, ఇప్పుడు ఓ వ్యక్తి అభిప్రాయాన్ని మాత్రమే ముందుకు తీసుకొస్తున్నారని విమర్శలు చేశారు. వారికి సంబంధించి ఏ విషయాలు బయటపడతాయోనని ప్రభుత్వం భయపడుతోందన్నారు. అందుకే ఆ పుస్తకం ప్రచురణకు అనుమతించడం లేదని ఆరోపించారు. ఇంకా ప్రచురణ కాని నరవణె రాసిన పుస్తకాన్ని విపక్ష నేత రాహుల్ గాంధీ పార్లమెంటు ప్రాంగణంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నేడు ప్రధాని మోదీ లోక్‌సభకు వస్తారని తాను అనుకోవడం లేదన్నారు. ఒకవేళ మోదీ వస్తే.. తానే స్వయంగా ఆయన వద్దకువెళ్లి ఈ పుస్తకాన్ని అందజేస్తానన్నారు.

### మోదీ ప్రసంగానికి ముందే..

: విపక్ష సభ్యుల ఆందోళనల మధ్య లోక్‌సభ గురువారం నాటికి వాయిదా పడింది. షెడ్యూల్ ప్రకారం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. లోక్‌సభలో ప్రసంగించాల్సి ఉంది. అయితే మోదీ ప్రసంగానికి ముందే సభను స్పీకర్ గురువారానికి వాయిదా వేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే క్రమంలో అధికార, విపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధం కొనసాగుతుండటంతో సభ బుధవారం మూడుసార్లు వాయిదా పడింది. తొలుత సభ ప్రారంభం కాగానే భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై చర్చ జరపాలంటూ విపక్ష సభ్యులు పట్టుబట్టడంతో గందరగోళ పరిస్థితుల మధ్య మధ్యాహ్నం 12 గంటల వరకూ లోక్‌సభ వాయిదా పడింది. దీంతో విపక్ష సభ్యులు పార్లమెంటు మెట్ల వద్ద ప్లకార్డులతో నిరసనకు దిగారు. మోదీ సర్కార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# న్యాయదేవత దుఃఖిస్తోంది : మమతా బెనర్జీ



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:** ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) వివాదంపై మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేశారు. బుధవారం ఈ అంశంపై సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా కోర్టుకు హాజరైన ఆమె.. తన పిటిషన్‌పై స్వయంగా వాదనలు వినిపించారు. ఈ క్రమంలో పలు కీలక వ్యాఖ్యలు చేశారు. 'తలుపుల వెనుక న్యాయ దేవత దుఃఖిస్తోంది' అని అన్నారు. సుప్రీంకోర్టులో అయినా తమకు న్యాయం జరగాలని ధర్మాసనాన్ని అభ్యర్థించారు మమత. పశ్చిమ బెంగాల్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియను వ్యతిరేకిస్తూ సీఎం మమతా బెనర్జీ, మోస్తారీ బాను, టీఎంసీ ఎంపీలు డెరెక్ ఓబ్రియన్, డోలా సేన్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలని అభ్యర్థించారు. ఈ పిటిషన్లు అన్నింటినీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం పంచోలిలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా తన పిటిషన్‌పై స్వయంగా వాదనలు వినిపించిన సీఎం మమతా బెనర్జీ.. ఎన్నికల సంఘాన్ని 'వాట్సాప్ కమిషన్'గా అభివర్ణించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ అంతా గందరగోళంగా ఉందని ఆరోపించారు. ప్రభుత్వం జారీ చేసిన ధ్రువపత్రాలు చూపించినా ఎస్ఐఆర్ అధికారులు అంగీకరించడం లేదని మమతా బెనర్జీ ఆరోపించారు. ఈ ఏడాది చివర్లో ఎన్నికలు జరుగనున్న అసోంలో కాకుండా.. పశ్చిమ బెంగాల్‌లో ఎస్ఐఆర్‌ను చేపడుతున్నారంటూ ఈసీ తీరుపై మమతా బెనర్జీ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్నికలు ఉన్న అసోంలో ఎందుకు ఎస్ఐఆర్ ప్రక్రియ చేపట్టడం లేదని ప్రశ్నించారామె. బీఎల్ఓలపై ఒత్తిడి తెచ్చి ఓట్లను తొలగిస్తున్నారని.. ఈ అంశంపై ఈసీకి ఆరుసార్లు లేఖ రాసినా పట్టించుకోలేదన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియతో బెంగాల్‌లో వంద మంది చనిపోయారన్నారు. సుప్రీంకోర్టులో అయినా న్యాయం జరుగుతుందని భావిస్తున్నామన్నారు సీఎం. 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి, ప్రజల హక్కులను కాపాడండి' అని సీజేఐకి మమతా బెనర్జీ విజ్ఞప్తి చేశారు. మమత అభ్యర్థనపై స్పందించిన సుప్రీంకోర్టు.. కేంద్ర ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది.

# గుహలో దాక్కున్న ఉగ్రవాదులు

### స్పెషల్ ఆపరేషన్‌తో ఖతం

### జమ్ము ఉదంపూర్‌లో ఎన్‌కౌంటర్



కశ్మీర్: జమ్మూ కశ్మీర్‌లోని ఉధంపూర్ జిల్లాలో భద్రతా దళాలు బుధవారం స్పెషల్ ఆపరేషన్‌తో ఉగ్రవాదుల్ని మట్టుబెట్టాయి. జైష్-ఎ-మొహమ్మద్‌కు చెందిన ఇద్దరు ఉగ్రవాదులు ఓ గుహలో తలదాచుకోవడం తీవ్ర కలకలం రేపింది. అయితే పక్కా సమాచారం అందుకున్న బలగాలు ఎన్‌కౌంటర్‌లో వాళ్లను హతమార్చి ఆపరేషన్ పూర్తి చేశాయి. భద్రతా దళాలు ప్రాంతాన్ని పూర్తిగా ముట్టడి చేసి, స్థానిక ప్రజలకు ఎలాంటి ప్రమాదం కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నాయి. ఉగ్రవాదులు గుహలో దాక్కోవడంతో.. ఆపరేషన్ క్లిష్టంగా మారినా, సైన్యం వ్యూహాత్మకంగా ముందుకు సాగి వారిని అంతం చేసింది. ఈ ఆపరేషన్‌లో.. గుహ నుంచి రైఫిళ్లు, పేలుడు పదార్థాలు, ఇతర ఆయుధాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మరికొందరు ఉగ్రవాదులు దాక్కున్నారా? అనే అనుమానంతో గాలింప చర్యలను ముమ్మరం చేశాయి. జైష్-ఎ-మొహమ్మద్ గతంలో కూడా జమ్మూ కశ్మీర్‌లో అనేక దాడులకు పాల్పడిన విషయం తెలిసిందే. అయితే మధ్యలో ఆ దాడుల ఆగిపోయాయి. ఇప్పుడు తాజాగా మళ్లీ ఆ సంస్థ యాక్టివ్ అయ్యింది. భద్రతా బలగాలు సకాలంలో స్పందించడంతో దాడుల ముప్పు తప్పింది. మంగళవారం సైతం ఉధంపూర్ జిల్లా బసంత్‌గఢ్, మజల్టా ప్రాంతంలో ఉగ్రవాదులకు, భద్రతా బలగాలకు కాల్పులు జరిగాయి. అయితే ఉగ్రవాదులు ఆ కాల్పుల నుంచి తప్పించుకున్నారు. ఆ వెంటనే భద్రతా బలగాలు తనిఖీలు ప్రారంభించాయి. ఇవాళ్టి ఉదంపూర్ గుహ ఎన్‌కౌంటర్‌లో మరణించింది.. ఆ ఉగ్రవాదులే అయ్యి ఉండొచ్చని అధికారులు అంటున్నారు. దీనిపై స్పష్టమైన ప్రకటన రావాల్సి ఉంది. ఇటీవల కిష్త్వార్ జిల్లాలో జరిగిన "ఆపరేషన్ త్రాషి-1" పేరిట భద్రతా బలగాలు స్పెషల్ ఆపరేషన్ చేపట్టాయి. ఆ ఆపరేషన్‌లో జైష్-ఎ-మొహమ్మద్ మిలిటెంట్లతో సుదీర్ఘ కాల్పులు జరిగి, ఒక పారా ట్రూపర్ మరణించగా, పది మంది సైనికులు గాయపడ్డారు. తాజాగా ఉదంపూర్‌లో జరిగిన ఆపరేషన్ దీనికి కొనసాగింపుగా తెలుస్తోంది.

# కొరియన్ గేమ్ మరణశాసనం

### ఆన్‌లైన్ గేమ్‌కు బానిసలై యూపిలో ముగ్గురు అక్కాచెల్లెళ్ల బలవన్మరణం




**లక్నో, ఫిబ్రవరి 4:** ఉత్తరప్రదేశ్‌లో దారుణ సంఘటన చోటుచేసుకుంది. ఆన్‌లైన్ కొరియన్ గేమ్ ముగ్గురు అక్కాచెల్లెళ్ల ప్రాణం తీసింది. ఆన్‌లైన్ గేమ్ ఆడవద్దని తల్లిదండ్రులు మందలించటంతో ముగ్గురు అక్కాచెల్లెళ్లు 9వ అంతస్తు నుంచి కిందకు దూకి ప్రాణాలు తీసుకున్నారు. ఈ సంఘటన మంగళవారం రాత్రి 2.30 గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి.. ఘజియాబాద్‌కు చెందిన 16 ఏళ్ల నిషిక, 14 ఏళ్ల ప్రాచి, 12 ఏళ్ల పఖి ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. అన్ని పనులు కలిసే చేసేవారు. కోవిడ్ సమయంలో ముగ్గురు అక్కాచెల్లెళ్లు టాస్క్ బేస్డ్ కొరియన్ ఆన్‌లైన్ గేమ్ 'కొరియన్ లవర్'కు బానిసలుగా మారారు. గంటలు, గంటలు గేమ్ ఆడుతూ గడిపేవారు. అంతేకాదు.. తమ పేర్లు మార్చుకుని కొరియన్ పేర్లు పెట్టుకున్నారు. గేమ్ అడిక్షన్ కారణంగా స్కూలుకు కూడా సరిగా వెళ్లేవారు కాదు. పిల్లలు పూర్తిగా గేమ్‌కు బానిసలుగా మారటంతో తల్లిదండ్రులకు కోపం వచ్చింది. వారిని ఇకపై గేమ్ ఆడవద్దని మందలించారు. దీంతో ముగ్గురూ మనస్తాపానికి గురయ్యారు. గేమ్ ఆడకుండా బతకలేమని భావించారు. ఈ నేపథ్యంలోనే ముగ్గురూ కలిసి చనిపోవాలని నిశ్చయించుకున్నారు. మంగళవారం 8 పేజీల సూసైడ్ నోట్ రాశారు. రాత్రి 2.30 గంటల ప్రాంతంలో 9వ అంతస్తులో ఉన్న తమ ఎ÷-లాట్ కిటికీ నుంచి ఒకరి తర్వాత ఒకరు కిందకు దూకి ప్రాణాలు తీసుకున్నారు. బిల్డింగ్ దగ్గర పెద్ద శబ్దం రావటంతో స్థానికులు అక్కడికి వచ్చారు. నేలపై రక్తపు మడుగులో పడి ఉన్న వారిని చూసి షాక్ అయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ముగ్గురిని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే వారు చనిపోయినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మాస్ సూసైడ్స్‌పై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అక్కాచె÷-లలెళ్ల గదిలోకి వెళ్లి పరిశీలించగా అక్కడ సూసైడ్ నోట్ దొరికింది. ఆ సూసైడ్ నోట్‌లో వారు తమ బాధనంతా వివరంగా రాసుకొచ్చారు. తల్లిదండ్రులకు క్షమాపణ సైతం చెప్పారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో ఏం తేలిదంటే.. ప్రాచీ విపరీతంగా మొబైల్ ఫోన్ వాడేది. ఆమె కారణంగానే మిగిలిన ఇద్దరూ ఆన్‌లైన్ గేమ్ 'కొరియన్ లవర్'కు బానిసలుగా మారారు. చివరకు గేమ్ అడిక్షన్ కారణంగానే ముగ్గురూ ప్రాణాలు కోల్పోయారు.

# బీసీలను రాజ్యాధికారానికి దూరం చేస్తున్న మోడీ ప్రభుత్వం

## జనగణనలోనే కులగణన చేయాలి



**శెనార్తి మీడియా, బోథ్:**

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం బీసీ ప్రధానమంత్రి అని చెబుతూ బీసీలను రాజ్యాధికారానికి దూరం చేస్తుండి అని మార్కెట్ చైర్మన్ గంగారెడ్డి మరియు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి అన్నారు బోథ్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి తో కలిసి పాత్రికేయ సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 30 2025న కేంద్ర కేబినెట్ జనగణన లోనే కులగణన నిర్వహిస్తామని చెప్పి జనవరి 22న కేవలం జనగణన కోసం నోటిఫికేషన్ విడుదల చేశారని తెలిపారు తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కులగణన జరిపి దేశానికే రోల్ మోడల్ గా నిల్చమని, కులాల వారిగా వాటాలు తేల్చి రాజకీయ రిజర్వేషన్లు కూడా కల్పించామని పేర్కొన్నారు జనగణలో కేవలం ఎస్సీ ఎస్టీల జనగణ మాత్రమే చేస్తున్నారని అన్ని కులాలు, ఉప కులాల వారిగా నిర్ధారించి బడ్జెట్ కేటాయింపులు, సంక్షేమ ఫలాలు, ప్రత్యేక రాయితిలు కల్పించే అవకాశం ఉంటుందని మేమెంతో మాకంతా నినాదాన్ని తుంగలో తొక్కి దొడ్డి దారిలో రాజ్యాధికారానికి దూరం చేస్తుందని విమర్శించారు రాష్ట్రంలోని బీసీ సంఘాలు బిజెపి ఎంపీలపై ఒత్తిడి పెంచి పార్లమెంట్లో చర్చ జరిపించే విధంగా ఒత్తిడిచేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ సర్పంచ్ పెందూర్ పృథ్వీరాజ్, అడప నవీన్ కుమార్, ఎల్మ రోహిణి వినయ్ రెడ్డి,సుద్దుల అరుణ్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ మహమ్మద్ అబ్రార్, సీనియర్ నాయకులు మెరుగు భోజన్న, పన్నాల చమేందర్ రెడ్డి, కోలా ప్రశాంత్, తరుణ్, యువ నాయకులు అచ్యుతానంద రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా నాయకులు ఉమేష్ జాదవ్ తదితరులు పాల్గొన్నారు

# నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవు



**శెనార్తి మీడియా, బోథ్:**

ఆదిలాబాద్ జిల్లా అటవీ అధికారి శ్రీ ప్రశాంత్ బజీరావ్ పాటిల్ ఆదేశాల మేరకు ఎఫ్‌డీఓ చిన్న బుసా రెడ్డి మరియు రేంజ్ అధికారి ప్రణయ్ ఆధ్వర్యంలో అటవీ పరిధిలో అక్రమ కార్యకలాపాలపై బోథ్ మండలం లో ప్రత్యేక నిఘా నిర్వహించరూ ఈ సందర్భంగా అటవీ ప్రాంతానికి సమీపంలో అక్రమంగా అటవీ ఉత్పత్తులను సేకరించి ఇంట్లో నిల్వ ఉంచుకున్న ఘటనలను గుర్తించడం జరిగింది.పరిశీలనలో భాగంగా నిర్వహించిన తనిఖీల్లో భోజ్జ సురేష్ మరియు మాడవి బాపురావు అనే వ్యక్తులు అటవీ ఉత్పత్తులకు సంబంధించిన కలపను అక్రమంగా నిల్వ ఉంచుకున్నట్లు గుర్తించి వారి నుండి కలప స్వాధీనం చేసుకున్నరు కలప విలువ సుమారు ఇరవై వేల రూపాయల విలువ కట్టే స్వాధీనం చేసుకున్నారు ఈ ఘటనకు సంబంధించి అటవీ చట్టాల ప్రకారం కేసు నమోదు చేసారు మరియు షేక్ మొయిన్ అనే వ్యక్తి అక్రమంగా అటవీ ఉత్పత్తులను రవాణా చేస్తున్నట్లు గుర్తించి, అతని వద్ద నుండి కలపను స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఈ.ఘటనకు సంబంధించి కూడా అటవీ చట్టాల ప్రకారం కేసు నమోదు చేశారు ఈ తనిఖీల్లో అటవీ శాఖ సిబ్బంది అనిల్, గోవింద్, ఎఫ్ఎస్ఓ ముమ్తాజ్, నాగోరావు, ఇతర అటవీ సిబ్బంది పాల్గొన్నారు. అటవీ సంపదను సంరక్షించడానికి ఇలాంటి నిఘా చర్యలు కొనసాగుతాయని తెలిపారు





# ముఖ్యమంత్రి పర్యటనకు సర్వం సిద్ధం

## పటిష్ట బందోబస్తును కలెక్టర్ పమేలా సత్పతి తో కలిసి సమీక్షించిన సీపీ గౌష్ ఆలం

**శెనార్తి మీడియా, బోథ్ :** ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గురువారం (ఫిబ్రవరి 5న) కరీంనగర్ జిల్లా, చొప్పదండి నియోజకవర్గంలోని గుమ్లాపూర్ శివారులో పర్యటించనున్నారు. ఈ పర్యటన నేపథ్యంలో బుధవారం నాడు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి పోలీస్ కమిషనర్ (సీపీ) క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. గుమ్లాపూర్ వద్ద ఏర్పాటు చేసిన సభా ప్రాంగణం, హెలిపాడ్ మరియు పార్కింగ్ స్థలాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సీపీ అధికారులను ఆదేశించారు. పటిష్ట బందోబస్తు: బందోబస్తు విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులకు, సిబ్బందికి, సీపీ మ్యాప్ ద్వారా రూట్ మ్యాప్ మరియు విధులను వివరించారు. ఎక్కడా చిన్నపాటి లోటుపాట్లు లేకుండా భారీ పోలీస్ మోహరింపును ఏర్పాటు చేసినట్లు సీపీ స్పష్టం చేశారు. సభా ప్రాంగణం మరియు చుట్టుపక్కల ప్రాంతాలను డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా భద్రతా చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ మరియు పార్కింగ్: సభకు వచ్చే భారీ జనం మరియు వాహనాల దృష్ట్యా ప్రత్యేక పార్కింగ్ స్థలాలను కేటాయించారు. ట్రాఫిక్ జామ్ కాకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని ట్రాఫిక్ విభాగాన్ని ఆదేశించారు. సౌకర్యాలు: సభా ప్రాంగణంలో బారికేడ్ల నిర్మాణం, ప్రజల రాకపోకల మార్గాలను పరిశీలించి, భద్రతా ప్రమాణాల మేరకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులతో పాటు రెవెన్యూ, ఫైర్, ఆర్ అండ్ బి (R&B), ఫారెస్ట్, వైద్య, ఎక్సైజ్, మరియు ఐ అండ్ పిఆర్ (I&PR) విభాగాల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.







# ప్రజా బలంతోనే బరిలో ఉంటా

**శెనార్తి మీడియా, కరీంనగర్:**

- పుట్టిన గడ్డ ఋణం తీర్చుకుంటా
- కరీంనగర్ కార్పొరేషన్ 10వ డివిజన్ స్వతంత్ర అభ్యర్థి, సౌగాని కొమురయ్య



ప్రజా బలంతో కరీంననగర్ కార్పొరేషన్ ఎన్నికల బరిలో నిలిచి, గెలిచి పుట్టిన గడ్డ రుణంగా తీర్చుకుంటానని 10వ డివిజన్ స్వతంత్ర అభ్యర్థి సౌగాని కొమురయ్య స్పష్టం చేశారు. కరీంనగర్ కార్పొరేషన్ 10వ డివిజన్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న సౌగాని కొమురయ్య ఇంటింటా ప్రచారం విస్తృతం చేశారు. తమ అనుచరులు, మద్దతు దారులతో కలిసి ఓటర్లను స్వయంగా కలుస్తున్నారు. కార్పొరేటర్ గా తనను గెలిపిస్తే తాను చేసే అభివృద్ధి ఏమిటో ప్రజలకు వివరిస్తున్నారు.

**కరీంనగర్ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు**

కరీంనగర్ నగర రాజకీయాల్లో టికెట్ల కేటాయింపులో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని 10వ డివిజన్ బీసీలకు రిజర్వు అయ్యింది. దాదాపు మూడు దశాబ్దాలకు విద్యా ప్రదాత పేరొందిన సౌగాని కొమురయ్యకు కార్పొరేటర్ టికెట్ ఇస్తామని హామీ ఇచ్చి బీజేపీ నాయకులు పార్టీలో చేర్చుకున్నారు. డివిజన్‌లో ప్రచారం చేసుకోవాలని చెప్పడంతో ప్రజల్లోకి వెళ్లారు. అయితే టికెట్ కేటాయింపు సమయంలో ఆ పార్టీ నిర్ణయం మారింది. డివిజన్‌తో సంబంధం లేని వ్యక్తికి టికెట్ ఇవ్వడంతో సౌగాని కొమురయ్య అనుచరులు అసంతృప్తి వ్యక్తం చేశారు. హామీ ఇచ్చి టికెట్ ఇవ్వకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. నగరంలో విద్యా రంగంలో విశేష సేవలందిస్తున్న సౌగాని కొమురయ్య సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ మరింత గుర్తింపు పొందారు.ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే రాజకీయాల్లోకి వచ్చారని అనుచరు లు తెలిపారు. టికెట్ హామీ నేపథ్యంలోనే పార్టీ సభ్యత్వం తీసుకున్నట్లు చెబుతున్నారు.

ఈ అంశంపై స్పందించిన సౌగాని కొమురయ్య బీజేపీ నాయకులు తనకు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదనే ఆవేదన వ్యక్తం చేశారు. ఆ పార్టీ నాయకులు చేసిన ద్రోహానికి వెన్ను చూపేది లేదని, ప్రజల మద్దతుతో ముందుకే సాగుతానని స్పష్టం చేశారు. డివిజన్ ప్రజలు, విద్యావంతులు, యువకులు, మహిళా సంఘాలు, కుల సంఘాల సహకారంతో స్వతంత్ర అభ్యర్థిగా తన ప్రచారాన్ని మరింత ముమ్మరంగా సాగిస్తున్నారు. పుట్టిన గడ్డ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని చెప్పారు.





# ఫ్యాటీ లివర్‌తో బాధపడుతున్నారా..? అయితే ఈ ఆహారాలను తీసుకోండి..!

మన శరీరంలోని విష పదార్థాలను బయటకు పంపించడంలో కాలేయం ముఖ్య పాత్ర పోషిస్తుంది. రక్తం నుండి విషాన్ని తొలగించడంలో, హానికరమైన పదార్థాలను విచ్ఛినం చేయడంలో, అనారోగ్య సమస్యలకు వాడే మందుల నుండి వచ్చే విషాలను తొలగించడంలో ఇలా అనేక రకాలుగా కాలేయం తన విధులను నిర్వర్తిస్తుంది. అలాగే పిత్తాన్ని విడుదల చేసి జీర్ణక్రియలో కూడా కాలేయం కీలక పాత్ర పోషిస్తుంది. కొవ్వులను విచ్ఛినం చేయడంలో, శరీరం పోషకాలను గ్రహించేలా చేయడంలో ఈ పిత్త రసం పాత్ర ఎంతో ఉంది. కానీ మారిన మన జీవన విధానం కారణంగా మనలో చాలా మంది కాలేయ సంబంధిత సమస్యల బారిన పడుతున్నారు. ముఖ్యంగా ఫ్యాటీలివర్ సమస్యతో బాధపడే వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. కనుక కాలేయ ఆరోగ్యంపై కూడా జాగ్రత్త వహించడం చాలా అవసరం.



### గుమ్మడి గింజలు..

జీవన శైలిలో మార్పులు చేసుకోవడంతో పాటు సరైన ఆహారాలను తీసుకోవడం వల్ల మనం కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. అలాగే మెగ్నీషియం ఎక్కువగా ఉండే ఆహారాలను తీసుకోవడం వల్ల ఫ్యాటీ లివర్ సమస్య వచ్చే అవకాశం తక్కువగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. మెగ్నీషియం ఉండే ఆహారాలు ఫ్యాటీ లివర్ సమస్యను తగ్గించడంతో పాటు శరీర ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తాయని వారు చెబుతున్నారు. గుమ్మడి గింజలను అవకాడాతో కలిపి తీసుకోవడం వల్ల కాలేయ ఆరోగ్యం మెరుగుపడుతుంది. అవకాడో చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించడంతో పాటు కాలేయ పనితీరుకు కూడా మద్దతును ఇస్తుంది. ఇందులో ఉండే మోనోశాచురేటెడ్ కొవ్వులు కాలేయం డిటాక్సిఫికేషన్ ను మెరుగుపరచడంలో దోహదపడతాయి. ఇక గుమ్మడి గింజలల్లో ఉండే మెగ్నీషియం, ఒమెగా 3 కొవ్వు ఆమ్లాలు కాలేయం వాపును తగ్గించడంలో, ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయి.

### పాలకూర, ఆలివ్ ఆయిల్..

అదే విధంగా పాలకూర, ఆలివ్ ఆయిల్ ను కలిపి తీసుకోవడం వల్ల ఫ్యాటీ లివర్ వచ్చే అవకాశం తక్కువగా ఉంటుంది. పాలకూరలో క్లోరోఫిల్ అధికంగా ఉంటుంది. ఇది కాలేయం పనితీరును మెరుగుపరచడంతో పాటు కాలేయంలో కొవ్వు పేరుకుపోవడాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. పాలకూరలో ఉండే నైట్రేట్స్, యాంటీ ఆక్సిడెంట్లు కాలేయ ఎంజైమ్ ల స్థాయిలను మెరుగుపరుస్తాయి. అలాగే ఆలివ్ ఆయిల్ శోథ నిరోధక లక్షణాలను కలిగి ఉంటుంది. దీనిని తీసుకోవడం వల్ల కాలేయ వాపు తగ్గుతుంది. ఇక పొట్టు మినపప్పు కూడా కాలేయ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో మనకు ఎంతగానో సహాయపడుతుంది. దీనిలో ఫైబర్ తో పాటు పోషకాలు కూడా ఎక్కువగా ఉంటాయి. మినపప్పును తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉండడంతో పాటు కాలేయంలో కొవ్వు పేరుకుపోవడం కూడా తగ్గుతుంది. దీనిలో ఉండే ఫ్లేవనాయిడ్స్, పాలీఫినాల్స్ ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి కాలేయ వ్యాధులు రాకుండా కాపాడతాయి.

### డార్క్ చాక్లెట్..

కాలేయ ఆరోగ్యాన్ని కాపాడడంలో డార్క్ చాక్లెట్ కూడా మనకు ఉపయోగపడుతుంది. దీనిలో ఎపికాటెచిన్, కాటెచిన్ అనే శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి కాలేయ వాపును తగ్గిస్తాయి. దీనిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఫ్యాటీ లివర్ సమస్య వచ్చే అవకాశాలు కూడా చాలా వరకు తగ్గుతాయి. సోయాబీన్స్ కూడా కాలేయంలో కొవ్వు పేరుకుపోవడాన్ని తగ్గిస్తాయి. సోయాలో జెనిస్టీన్, డైడ్జిన్ అనే సమ్మేళనాలు ఉంటాయి. ఇవి కాలేయంలో కొవ్వు పేరుకుపోవడాన్ని తగ్గిస్తాయి. అలాగే బాదం, జీడిపప్పులో కూడా మెగ్నీషియం అధికంగా ఉంటుంది. వీటిని తీసుకోవడం వల్ల శరీరంలో చెడు కొలెస్ట్రాల్ తగ్గడంతో పాటు మంచి కొలెస్ట్రాల్ స్థాయిలు పెరుగుతాయి. దీంతో ఫ్యాటీలివర్ సమస్య వచ్చే అవకాశాలు చాలా వరకు తగ్గుతాయి. వీటిని తీసుకోవడం వల్ల ఆక్సీకరణ ఒత్తిడి తగ్గి కాలేయ వ్యాధుల ప్రమాదం కూడా తగ్గుతుంది. ఈ విధంగా ఈ ఆహారాలను తీసుకోవడం వల్ల ఫ్యాటీ లివర్ తో పాటు ఇతర కాలేయ సమస్యలు వచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయని వైద్యులు సూచిస్తున్నారు. అంతేకాకుండా ఈ ఆహారాల్లో పోషకాలు కూడా అధికంగా ఉంటాయి కనుక వీటిని తీసుకోవడం వల్ల శరీర మొత్తం ఆరోగ్యానికి మేలు కలుగుతుందని వైద్యులు సూచిస్తున్నారు.

# ఎల్లప్పుడూ యవ్వనంగా కనిపించాలంటే.. ఇలా చేయండి..



వయసు పైబడే కొద్దీ వృద్ధాప్యం రావడం సహజం. వృద్ధాప్యం కారణంగా శరీరంలో ఇతర అవయవాల పనితీరు తగ్గినట్టుగానే చర్మం కూడా వృద్ధాప్య లక్షణాలను చూపిస్తుంది. చర్మం ముడతలు పడడం, చర్మం వదులుగా అవ్వడం, స్థిరత్వాన్ని కోల్పోవడం వంటివి జరుగుతూనే ఉంటాయి. చాలా మంది చర్మం చూపించే ఈ వృద్ధాప్య లక్షణాలను నివారించడానికి మేకప్ వేసుకోవడంతో పాటు చర్మం బిగుతుగా అవ్వడానికి శస్త్ర చికిత్సలు వంటివి కూడా చేయించుకుంటారు. అయితే ఇవన్నీ అవసరం లేకుండా మన రోజువారీ అలవాట్ల ద్వారా కూడా చర్మాన్ని ఎక్కువ కాలం యవ్వనంగా, శక్తివంతంగా ఉండేలా చేసుకోవచ్చు. జీవనశైలిలో మార్పులు చేసుకోవడం వల్ల చర్మాన్ని, శరీరాన్ని సహజంగా అందంగా, యవ్వనంగా మార్చుకోవచ్చు. చర్మం ఎక్కువకాలం పాటు యవ్వనంగా ఉండడానికి జీవనశైలిలో ఎటువంటి మార్పులు చేసుకోవాలో.. తెలుసుకుందాం.

### నిద్ర ఆవశ్యకత..

రోజూ తగినంత నిద్రించాలి. నిద్రించడం వల్ల రోగనిరోధక వ్యవస్థ బలపడుతుంది. దీంతో కణాల మరమ్మత్తు జరుగుతుంది. దీంతో వృద్ధాప్యం నెమ్మదిస్తుంది. కనుక రోజూ 7 నుండి 8 గంటల పాటు నిద్రించడం చాలా అవసరం. అలాగే పండ్లు, కూరగాయలు, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉండే ఆహారాలను తీసుకోవాలి. వీటిలో యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి చర్మ స్థితిస్థాపకతను, కణాల మరమ్మత్తును ప్రోత్సహిస్తాయి. దీంతో వృద్ధాప్యం త్వరగా రాకుండా ఉంటుంది. క్రమం తప్పకుండా రోజూ వ్యాయామం చేయాలి. ఇలా చేయడం వల్ల రక్తప్రసరణ పెరుగుతుంది. శరీరం శక్తి కూడా పెరుగుతుంది. రక్తప్రసరణ పెరగడం వల్ల చర్మానికి పోషకాలు ఎక్కువగా అందుతాయి. దీంతో చర్మ ఆరోగ్యం, అందం రెండూ పెరుగుతాయి.

### ఒత్తిడిని తగ్గించుకోవాలి..

అదే విధంగా వృద్ధాప్యం త్వరగా రాకుండా ఉండాలంటే ఒత్తిడి తగ్గించుకోవాలి. యోగా, ధ్యానం వంటివి చేయడం వల్ల మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఒత్తిడి హార్మోన్ అయిన కార్టిసాల్ ఉత్పత్తి తగ్గుతుంది. ఇది చర్మానికి, శరీర ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. సూర్యుడి నుండి వచ్చే యూవీ కిరణాలు చర్మంపై నేరుగా పడడం వల్ల నల్ల మచ్చలు, ముడతలు రావడంతో పాటు దీర్ఘకాలిక చర్మ నష్టం కలుగుతుంది. కనుక చర్మంపై నేరుగా సూర్యుడి కిరణాలు పడకుండా జాగ్రత్త తీసుకోవాలి. ఈ విధంగా మన జీవనశైలిలో మార్పులు చేసుకోవడం వల్ల సహజంగానే చర్మం వృద్ధాప్య ఛాయలను తగ్గించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. జీవన శైలిలో వచ్చే ఈ మార్పులు చర్మానికే కాకుండా మొత్తం ఆరోగ్యానికి కూడా మేలు కలిగేలా చేస్తాయని నిపుణులు తెలియజేస్తున్నారు.

# షుగర్ ఉన్నవారు ఈ మిల్లెట్లను తీసుకోవాలి.. ఎంతో మేలు జరుగుతుంది..!

మధుమేహ వ్యాధి గ్రస్తులు ఆహారం తీసుకునే విషయంలో ప్రతిరోజూ ఒక సవాల్ ను ఎదుర్కొంటారని చెప్పవచ్చు. ఎందుకంటే వీరు తీసుకునే ఆహారం తక్షణమే రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతుంది, అనారోగ్యానికి కూడా దారి తీస్తుంది. కనుక ఆహార విషయంలో మధుమేహ వ్యాధి గ్రస్తులు చాలా జాగ్రత్తగా ఉండాలి. చాలా మంది చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుకోవడానికి చపాతీలను తీసుకుంటూ ఉంటారు. వీటిని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయని ఇవే సరైన ఆహారం అని నమ్ముతారు. అయితే ఇవే కాకుండా మిల్లెట్స్ తో చేసిన ఆహారాలను తీసుకోవడం మంచిదని వైద్యులు చెబుతున్నారు. చిరుధాన్యాలు తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ను కలిగి ఉంటాయి. దీంతో రక్తంలో చక్కెర స్థాయిలు వెంటనే పెరగకుండా ఉంటాయి. వీటిలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది కనుక నెమ్మదిగా జీర్ణమవుతాయి. దీంతో ఇన్సులిన్ సెన్సిటివిటీ పెరగడంతో పాటు స్థిరమైన శక్తి విడుదల అవుతుంది.




### సామలు..

మిల్లెట్స్ అన్నీ మేలు చేసేవే అయినప్పటికీ సజ్జలు, సామలు, కొర్రలు అనే ఈ మూడు రకాల మిల్లెట్స్ మరింత మేలు చేస్తాయని వైద్యులు తెలియజేస్తున్నారు. ఈ మిల్లెట్స్ లో ఫైబర్ తో పాటు పోషకాలు, యాంటీ ఆక్సీడెంట్లు కూడా ఉంటాయని వీటిని తీసుకోవడం వల్ల మధుమేహ వ్యాధి గ్రస్తులకు ఎంతో మేలు కలుగుతుందని వారు సూచిస్తున్నారు. సామలు తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ను కలిగి ఉంటాయి. రక్తంలో గ్లూకోజ్ ను నెమ్మదిగా విడుదల చేయడంలో ఇవి సహాయపడతాయి. దీంతో రక్తంలో చక్కెర పెరుగుదల నివారించబడుతుంది. వీటిలో ఉండే అధిక ఫైబర్ గ్లూకోజ్ ను నియంత్రించడంతో పాటు ఇన్సులిన్ సెన్సిటివిటీని కూడా పెంచుతుంది. సామల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి మొత్తం శరీరానికి మేలు చేస్తాయి. వీటిలో ఫైబర్ అధికంగా ఉంటుంది కనుక జీర్ణశక్తి కూడా మెరుగుపడుతుంది. మలబద్దకం వంటి సమస్యలు తగ్గుతాయి.

### కొర్రలు..

కొర్రలు వాటి తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ కు, ఫైబర్ కు ప్రసిద్ధి చెందాయని చెప్పవచ్చు. రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంలో, ఇన్సులిన్ నిరోధకతను తగ్గించడంలో ఇవి ఎంతో సహాయపడతాయి. వీటిలో పొటాషియం, మెగ్నీషియం వంటి ఖనిజాలు కూడా ఉంటాయి. కనుక కొర్రలను తీసుకోవడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. మంచి బ్యాక్టీరియాను పెంపొందించడంలో, జీర్ణక్రియను మెరుగుపరచడంలో, శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడంలో కూడా కొర్రలు మనకు సహాయపడతాయి.



### సజ్జలు..

సజ్జల్లో మెగ్నీషియం, ఐరన్, క్యాల్షియం వంటి ఖనిజాలు ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల ఎముకలు దృఢంగా తయారవుతాయి. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇవి తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ను కలిగి ఉంటాయి. కనుక వీటిని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. అలాగే శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు కూడా తగ్గుతాయి. గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. వీటిని తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. ఆకలి నియంత్రణలో ఉంటుంది. దీంతో బరువు అదుపులో ఉంటుంది. డయాబెటిస్ తో బాధపడే వారు ఈ మూడు రకాల మిల్లెట్స్ ను ఆహారంగా తీసుకోవడం వల్ల చక్కెర స్థాయిలు ఎల్లప్పుడూ అదుపులో ఉంటాయి. శరీర మొత్తం ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. వీటితో తరచూ పాన్‌కేక్స్, కిచిడీ, పొంగల్, ఉప్మా, దోశ, ఇడ్లీ వంటి వాటిని కూడా తయారు చేసి తీసుకోవడం వల్ల రుచితో పాటు ఆరోగ్యాన్ని కూడా పొందవచ్చని వైద్యులు తెలియజేస్తున్నారు.



## మంచు కొండల్లో అలుపెరుగని పరుగు

### సూఫియా సూఫీ రికార్డు

**మనాలి - లేహ్ మార్గంలో 480 కిలోమీటర్ల సాహసం**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 04:** భారతీయ అల్ట్రా మారథాన్ రన్నర్ సూఫియా సూఫీ హిమాలయ సానువుల్లో అద్భుత సాహసం చేసి చరిత్ర సృష్టించారు. ప్రపంచంలోనే అత్యంత కఠినమైన మార్గాల్లో ఒకటిగా పేరొందిన మనాలి నుండి లేహ్ వరకు ఉన్న 480 కిలోమీటర్ల దూరాన్ని కేవలం పరుగు ద్వారా అధిగమించి ఆమె రికార్డు నెలకొల్పారు. సముద్ర మట్టానికి వేల అడుగుల ఎత్తులో, ఆక్సిజన్ స్థాయిలు చాలా తక్కువగా ఉండే ప్రతికూల పరిస్థితులను సైతం లెక్కచేయకుండా ఆమె ఈ ఘనతను సాధించడం విశేషం. వాహనాల్లో వెళ్లడానికే ఎంతో కష్టంగా ఉండే ఈ మార్గంలో, సూఫియా ఐదు ఎత్తైన పర్వత కనుమలను దాటాల్సి వచ్చింది. గడ్డకట్టే చలిని, శారీరక శ్రమను తట్టుకుంటూ ఆమె 97 గంటల 2 నిమిషాల్లో ఈ లక్ష్యాన్ని పూర్తి చేశారు. తద్వారా ఆమె గిన్నిస్ వరల్డ్ రికార్డుల్లో తన పేరును లిఖించుకున్నారు. గతంలో కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు పరుగు తీసిన సూఫియా, ఇప్పుడు ఈ విజయంతో భారతీయ మహిళల సంకల్ప బలాన్ని మరోసారి ప్రపంచానికి చాటిచెప్పారు.

# రికార్డు చేజింగ్..

**అఫ్గాన్‌పై 7 వికెట్ల తేడాతో ఘన విజయం**

**అండర్-19 చరిత్రలో అత్యధిక లక్ష్యాన్ని ఛేదించిన భారత్**

# ఫైనల్లో భారత్

### ఆరోన్ జార్జ్ సెంచరీ, వైభవ్ సూర్యవంశీ మెరుపులు

### వరుసగా ఏడోసారి ఫైనల్ చేరిన యువ భారత్



**ఫిబ్రవరి 6న ఇంగ్లాండ్‌తో ఫైనల్**

**హరారే/జింబాబ్వే, ఫిబ్రవరి 04:** జింబాబ్వే వేదికగా జరుగుతున్న అండర్-19 ప్రపంచ కప్ సెమీఫైనల్లో భారత యువజట్టు చరిత్ర సృష్టించింది. బుధవారం జరిగిన ఉత్కంఠ పోరులో అఫ్గానిస్థాన్ నిర్దేశించిన భారీ లక్ష్యాన్ని అలవోకగా ఛేదించి, రికార్డు స్థాయి విజయాన్ని నమోదు చేసింది. ఈ గెలుపుతో టీమిండియా వరుసగా ఏడోసారి ప్రపంచ కప్ ఫైనల్ లోకి దూసుకెళ్లింది.

**భారీ లక్ష్యం.. అయినా బెదరలేదు..**

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అఫ్గానిస్థాన్ నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 310 పరుగుల భారీ స్కోరు సాధించింది. అఫ్గాన్ బ్యాటర్లు ఫైసల్ షినోజాదా (110 పరుగులు), ఉజైరుల్లా నియాజాయ్ (101 పరుగులు) అద్భుత సెంచరీలతో భారత బౌలర్లపై విరుచుకుపడ్డారు. ప్రపంచ కప్ నాకౌట్ మ్యాచ్‌లో ఇంత పెద్ద లక్ష్యం ముందున్నా, భారత కుర్రాళ్లు ఏమాత్రం ఒత్తిడికి లోనవ్వలేదు. కేవలం 41.1 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి 311 పరుగులు చేసి విజయాన్ని అందుకోవడం విశేషం. ఇది అండర్-19 ప్రపంచ కప్ చరిత్రలోనే అత్యధిక పరుగుల చేజింగ్ రికార్డుగా నమోదైంది.

**మెరుపు ఆరంభం - నిలకడైన ఆట..**

భారత విజయంలో ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ పాత్ర కీలకం. కేవలం 33 బంతుల్లోనే 68 పరుగులు (9 ఫోర్లు, 4 సిక్సర్లు) చేసి అఫ్గాన్ బౌలర్ల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీశాడు. వైభవ్ ఇచ్చిన మెరుపు ఆరంభంతో రన్ రేట్ ఒత్తిడి పూర్తిగా తగ్గిపోయింది. ఆ తర్వాత వచ్చిన ఆరోన్ జార్జ్ క్రీజులో పాతుకుపోయి, బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. 104 బంతుల్లో 115 పరుగులు చేసి శతకంతో కదంతొక్కాడు. కెప్టెన్ ఆయుష్ మ్హాత్రే (62 పరుగులు) కూడా అర్ధ శతకంతో రాణించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు.

**గెలుపు మంత్రం ఇదే..**

సాధారణంగా నాకౌట్ మ్యాచ్‌లలో 300 పరుగుల లక్ష్యం అంటే బ్యాటర్లపై విపరీతమైన ఒత్తిడి ఉంటుంది. కానీ భారత జట్టు వ్యూహం అద్భుతంగా ఫలించింది. వైభవ్ సూర్యవంశీ మొదటి పది ఓవర్లలోనే స్కోరు బోర్డును పరుగులు పెట్టించి, అఫ్గాన్ ఆశలపై నీళ్లు చల్లాడు. వికెట్లు పడుతున్నా.. ఆరోన్ జార్జ్, ఆయుష్ మ్హాత్రే మధ్య ఏర్పడిన 114 పరుగుల భాగస్వామ్యం ఇన్నింగ్స్‌ను నిలబెట్టింది. యువ ఆటగాళ్లు లక్ష్యాన్ని చూసి భయపడకుండా, తమ సహజసిద్ధమైన దూకుడును ప్రదర్శించడం వల్లే ఈ రికార్డు విజయం సాధ్యమైంది. ఫైనల్లో భారత జట్టు ఇంగ్లాండ్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్ ఫిబ్రవరి 6న జరగనుంది.



# దక్షిణాఫ్రికాపై భారత్ ఘన విజయం

### వార్మప్ మ్యాచ్‌లో 30 పరుగుల తేడాతో గెలుపు.. ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా మెరుపులు

### బౌలింగ్‌లో సత్తా చాటిన అభిషేక్ శర్మ, వరుణ్ చక్రవర్తి..ప్రపంచ కప్‌కు ముందు దక్కిన ఆత్మవిశ్వాసం



**ఫైనల్‌లో తడబాటుతో చేజారిన రజతం**

**ముంబై/నవీ ముంబై, ఫిబ్రవరి 04:** టీ20 ప్రపంచ కప్ సన్నాహకాల్లో భాగంగా బుధవారం నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియం వేదికగా జరిగిన ఏకైక వార్మప్ మ్యాచ్‌లో భారత జట్టు సత్తా చాటింది. దక్షిణాఫ్రికాతో జరిగిన ఈ పోరులో టీమిండియా 30 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి, ప్రపంచ కప్ వేటకు సిద్ధమని చాటిచెప్పింది. బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ ఆధిపత్యం ప్రదర్శించిన రోహిత్ సేన ప్రత్యర్థిని చిత్తు చేసింది.

**భారత్ భారీ స్కోరు..**

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 240 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్ ఇషాన్ కిషన్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. కేవలం 20 బంతుల్లోనే 7 సిక్సర్లు, 2 ఫోర్లతో 53 పరుగులు చేసి రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. మరోవైపు యువ ఆటగాడు తిలక్ వర్మ 19 బంతుల్లో 45 పరుగులు, అభిషేక్ శర్మ 17 బంతుల్లో 24 పరుగులతో రాణించారు. ఇక ఇన్నింగ్స్ చివరలో వైస్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా తనదైన శైలిలో విరుచుకుపడ్డాడు. కేవలం 10 బంతుల్లోనే 30 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. సూర్యకుమార్ యాదవ్ (30), అక్షర్ పటేల్ (35) కూడా తమ వంతు సహకారం అందించారు.



దక్షిణాఫ్రికా బౌలర్లలో మార్కో జాన్సెన్, క్వెనా మఫాకా తలా ఒక వికెట్ తీశారు.

**పోరాడి ఓడిన సఫారీలు..**

241 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా జట్టు, నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 210 పరుగులకే పరిమితమైంది. ఆ జట్టు బ్యాటర్లు ట్రిస్టన్ స్టబ్స్, రయాన్ రికెల్టన్ పోరాడినప్పటికీ విజయం దక్కలేదు. స్టబ్స్ 21 బంతుల్లో 45 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఇన్నింగ్స్ చివరి ఓవర్‌లో శివమ్ దూబే బౌలింగ్‌లో స్టబ్స్ వరుసగా మూడు సిక్సర్లు బాదడం మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది. రికెల్టన్ 44 పరుగులు, కెప్టెన్ మార్క్రమ్ 38 పరుగులు చేశారు.

**బౌలర్ల కట్టుదిట్టం..**

భారత బౌలర్లు సమష్టిగా రాణించారు. అభిషేక్ శర్మ 3 ఓవర్లలో 32 పరుగులు ఇచ్చి 2 కీలక వికెట్లు పడగొట్టాడు. వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్ తలా ఒక వికెట్ తీసి ప్రత్యర్థిని కట్టడి చేశారు. బౌలర్లను మార్చి మార్చి ప్రయోగించినా ఫలితం దక్కింది. హర్షిత్ రాణా గాయం కారణంగా ఒక ఓవర్ మాత్రమే వేసి మైదానం వీడాల్సి వచ్చింది. ఈ విజయంతో భారత జట్టు ఫిబ్రవరి 7న అమెరికాతో జరగబోయే ప్రపంచ కప్ తొలి మ్యాచ్‌కు రెట్టింపు ఉత్సాహంతో సిద్ధమైంది.

### ఏషియన్ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో

## సమ్రాట్ రాణాకు కాంస్యం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 05 : ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత షూటర్ సమ్రాట్ రాణా పతకంతో మెరిశారు. పురుషుల పది మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో ఆయన కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నారు. క్వాలిఫికేషన్ రౌండ్‌లో 581 పాయింట్లు సాధించి అద్భుత ప్రదర్శన కనబరిచిన సమ్రాట్, ఫైనల్ పోరులోనూ ఆరంభంలో అదే జోరును ప్రదర్శించారు. దీంతో పతకం ఖాయం చేసుకున్నప్పటికీ, తుది ఫలితం మాత్రం కాస్త నిరాశ పరిచింది. ఫైనల్ ఆరంభంలో రెండో స్థానంలో కొనసాగిన సమ్రాట్, కీలక సమయంలో తీవ్ర ఒత్తిడికి లోనయ్యారు. ముఖ్యంగా ఎలిమినేషన్ దశలో గురి తప్పడంతో తక్కువ పాయింట్లు నమోదయ్యాయి. ఈ చిన్నపాటి తడబాటు కారణంగా ఆయన స్కోరు తగ్గి, రజత పతకం చేజారిపోయింది. చివర్లో కోలుకునే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోవడంతో, ఆయన మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ విభాగంలో చైనా షూటర్ స్వర్ణం గెలుచుకోగా, కొరియా షూటర్ రజతం సాధించారు.

## జాతీయ వెయిట్‌లిఫ్టింగ్‌లో మీరాబాయి చానుకు స్వర్ణం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 04:** జాతీయ సీనియర్ వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఒలింపిక్ పతక విజేత, స్టార్ లిఫ్టర్ మీరాబాయి చాను మరోసారి తన ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. మహిళల 49 కిలోల విభాగంలో బరిలోకి దిగిన ఆమె, తనదైన శైలిలో అద్భుత ప్రదర్శన కనబరిచి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నారు. స్నాచ్, క్లీన్ అండ్ జెర్క్ రెండు విభాగాల్లోనూ ప్రత్యర్థులకు అందనంత దూరంలో నిలిచిన మీరాబాయి, మొత్తం బరువును అలవోకగా ఎత్తి అగ్రస్థానంలో నిలిచారు. గాయం కారణంగా కొంతకాలం విరామం తీసుకున్నప్పటికీ, పునరాగమనంలో ఆమె ఏమాత్రం తడబడకుండా పసిడి పతకాన్ని సాధించడం విశేషం. ఈ ఛాంపియన్‌షిప్‌లో రైల్వేస్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన మీరాబాయి చాను, తన అనుభవాన్నంతా రంగరించి ఈ విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఈ గెలుపుతో రాబోయే కామన్వెల్త్ గేమ్స్, ఇతర అంతర్జాతీయ పోటీలకు ఆమె మరింత ఆత్మవిశ్వాసంతో సిద్ధమవుతున్నారు. దేశీయ వేదికపై తనకు తిరుగులేదని ఆమె మరోసారి



నిరూపించుకున్నారు. కాగా, ఇదే విభాగంలో మిగిలిన రాష్ట్రాల లిఫ్టర్లు రజత, కాంస్య పతకాల కోసం పోటీపడాల్సి వచ్చింది. మీరాబాయి ప్రదర్శన పట్ల భారత వెయిట్‌లిఫ్టింగ్ సమాఖ్య ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.




# అవతార్ లెవల్లో వారణాసి

- పదిహేనేళ్ల క్రితం ప్లాన్ చేస్తే ఇప్పుడు కుదరింది
- ఈ సినిమాలో రాముడిగా మహేశ్ బాబు కనిపిస్తారు
- అత్యద్భుత దృశ్యకావ్యంగా మూవీని విడుదల చేస్తున్నాం
- అంతర్జాతీయ మీడియాతో రాజమౌళి, మహేశ్ బాబు

రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా రానున్న 'వారణాసి' ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్ అవుతోంది. ఎన్నో రోజుల నుంచి అప్‌డేట్స్ కోసం ఎదురుచూసిన అభిమానులకు చాలా విశేషాలు వచ్చేశాయి. చిత్రబృందం ఓ హాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'వారణాసి' గురించి పంచుకుంది. దీంతో ఈ చిత్రం ఒక్కసారిగా సోషల్‌మీడియాలో ట్రెండ్ అవుతోంది. రాముడిగా మహేశ్‌బాబు కనిపించనున్నట్లు అధికారికంగా వెల్లడించారు. ఇక రాజమౌళి ఈ సినిమా నిడివితో పాటు 'అవతార్'తో పోల్చడం గురించి మాట్లాడారు. నాకు ఉన్న కొన్ని కమిట్‌మెంట్‌ల కారణంగా మహేశ్‌బాబుతో సినిమా ఆలస్యం అయింది. లేదంటే 15 ఏళ్ల క్రితమే తీసేవాడిని. ఇప్పుడు వారణాసిని భారీ స్థాయిలో విడుదల చేస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా ఐమ్యాక్స్‌లలో సందడి చేయనుంది. నేను సినిమాలు ఆలస్యం చేస్తాననే చెడ్డపేరు ఉంది. ప్రొడక్షన్ పనులు లేట్ చేస్తానని వాయిదాలు వేస్తానని అంటారు. ఈ విషయంలో నెటిజన్లు కూడా చాలాసార్లు కామెంట్స్ చేశారు. 'వారణాసి' 3.20 గంటల నిడివితో విడుదలవుతుంది. ఇంత ఎక్కువ నిడివిలో మూడు నిమిషాలు ఆసక్తిగా లేకపోయినా వెంటనే ఆడియన్స్ ఫోన్ తీసుకుంటారు. మేం అందుకే చాలా జాగ్రత్తగా ఎక్కడా బోర్ కొట్టకుండా దీన్ని రూపొందిస్తున్నాం. ప్రేక్షకుడికి ప్రతి క్షణం ఆసక్తి కలిగేలా.. కొత్త అనుభవాన్ని ఇచ్చేలా దీన్ని తీర్చిదిద్దుతున్నాం అని రాజమౌళి తెలిపారు. హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామెరూన్ సృష్టించిన ప్రపంచం 'అవతార్'తో రాజమౌళి 'వారణాసి'ని పోల్చడంపై ఆయన మాట్లాడారు. అలాంటి వ్యక్తితో పోల్చడాన్ని చాలా గౌరవంగా భావిస్తున్నా. కానీ, ఆయనతో నన్ను పోల్చొద్దు. ఆయన ఒక శిఖరం. ఆయన మాస్టర్. నేను ఇంకా విద్యార్థినే. 'వారణాసి'లో 25 నిమిషాలు పురాణాలపై చిత్రీకరించాం. ప్రేక్షకులు ఎప్పటికీ ఆ సన్నివేశాలను మర్చిపోలేరు. ప్రస్తుతం ఇంతవరకూ మాత్రమే చెప్పగలను అని దర్శకధీరుడు తెలిపారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇక ఈ సినిమాలో మహేశ్ బాబుతో పాటు ప్రియాంక చోప్రా కూడా ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. దయచేసి నాకు ఈ సినిమాలో డ్యాన్స్ వేసే అవకాశం ఇవ్వండి. మంచి పాట ఉండేలా చూడండి' అని చెప్పాని ప్రియాంక అన్నారు. ఈ సినిమాలో వారి పాత్రల దగ్గర నుంచి కథ ఎలా మొదలైంది వరకూ మహేశ్ బాబు విశేషాలు తెలిపారు. 15 ఏళ్ల కిత్రమే రాజమౌళి దర్శకత్వంలో చేయాల్సిఉంది. ఇప్పటికి అది కుదిరింది. 'ఆర్ఆర్ఆర్' పూర్తయిన తర్వాత ఏడాది పాటు దీని స్క్రిప్ట్ గురించి ఆలోచించారు. నన్ను ఆఫీసుకు పిలిచి 'వారణాసి' స్క్రిప్ట్ గురించి చెప్పారు. కథ విని ఆశ్చర్యపోయాను. ఇప్పటివరకూ రాజమౌళి చేసిన అన్ని చిత్రాల కంటే ఇది భిన్నంగా ఉంటుంది. ఇందులో ఎన్నో అంశాలు ఉన్నాయి. యాక్షన్, అడ్వెంచర్, పురాణాలు, టైమ్ ట్రావెల్.. ఇలా ఎన్నో ఉన్నాయి. రాజమౌళి అభిమానిగా ఈ సినిమా కోసం నేనూ ఆసక్తిగా ఉన్నాను. ఇందులో హీరోగా చేయడానికి మొదట్లో భయపడ్డాను. రాజమౌళి కథను వివరించిన విధానం నా భయాన్ని పోగొట్టిందని మహేశ్ బాబు అన్నారు. 'వారణాసి'లో లుక్స్ కోసం ఎన్నో రిహార్సల్స్ చేశాం. 2024 నుంచి ఈ పనిలోనే ఉన్నాం. గతేడాది జర్మనీ కూడా వెళ్లాం. నేను ఇందులో రాముడి పాత్ర పోషించాను. రాముడు అంటేనే హుందాతనం.. ఆయనకు ప్రత్యేకమైన భంగిమ ఉంటుంది. నిలబడే విధానం దగ్గర నుంచి పాత్రలో నటించడం వరకూ ఎన్నో రిహార్సల్స్ చేశాం. 2,3 నెలలు దానికోసమే కష్టపడ్డాం. రాజమౌళి నేను పరిగెత్తే విధానాన్ని కూడా మార్చారు. దానికోసం 6 నెలలు శిక్షణ తీసుకున్నాను. సినిమాలో రెండు షాట్ల కోసం ఇదంతా చేశాం. ఆయనకు సినిమాపై ఉన్న శ్రద్ధ ఎలాంటిదో చెప్పడానికి ఈ ఒక్క విషయం చాలు. ఈ సినిమా భారీస్థాయిలో విడుదలవుతుంది. 'వారణాసి' లో విలన్ పాత్ర కోసం మలయాళ స్టార్ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్‌ను ఎంపిక చేయడం సినీ వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీసింది. ఈ సినిమాలో పృథ్వీరాజ్ 'కుంభ' అనే ప్రతినాయక పాత్రలో కనిపించనున్నారు. తన కెరీర్‌లో ఇదే అత్యంత విభిన్నమైన, అంచనా వేయలేని పాత్ర అని ఆయన తెలిపారు. ఈ కుంభ క్యారెక్టర్ పూర్తిగా గ్రే షేడ్స్‌తో సాగుతుందని చెప్పారు. ఎప్పుడు ఏం చేస్తాడో ప్రేక్షకులు ఊహించలేని విధంగా ఈ పాత్రను డిజైన్ చేసినట్లు వెల్లడించారు. తన నిజజీవితానికి పూర్తిగా భిన్నమైన డార్క్ రోల్ కావడం వల్ల ఇది తనకు పెద్ద ఛాలెంజ్‌గా మారిందన్నారు. అత్యాధునిక టెక్నాలజీతో కూడిన వీల్‌చైర్, 'డాక్టర్ ఆక్టోపస్' తరహాలో రోబోటిక్ చేతులు వంటి ఎలిమెంట్స్‌తో పృథ్వీరాజ్ లుక్ భయానకంగా ఉండనుందని సమాచారం. కేవలం కళ్లతోనే భయపెట్టే విధంగా ఈ పాత్రను డిజైన్ చేశారనే ప్రచారం జరుగుతోంది. భారతీయ సినిమాల్లో ఇప్పటివరకు చూడని సైకలాజికల్ విలన్‌గా 'కుంభ' నిలుస్తాడని సినీ వర్గాలు భావిస్తున్నాయి. మొత్తానికి 'వారణాసి'లో హీరో మహేష్ బాబు పోషిస్తున్న 'రుద్ర' పాత్రకు సమానంగా నిలిచే 'కుంభ' విలన్ పాత్ర సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచే అవకాశముంది.





# ప్రేమలు సీక్వెల్ ఆగిపోలేదు

మలయాళ సెన్సేషనల్ హిట్ 'ప్రేమలు' చిత్రానికి సీక్వెల్ రాబోతున్న విషయం తెలిసిందే. 'ప్రేమలు 2' అంటూ ఈ సీక్వెల్ రాబోతుండగా.. తాజాగా ఈ ప్రాజెక్ట్ రద్దయిందంటూ వార్తలు వస్తున్నాయి. అయితే ఈ వార్తలపై చిత్రబృందం తాజాగా స్పందిస్తూ.. ఈ ప్రాజెక్ట్ పూర్తిగా నిలిచిపోలేదని కేవలం తాత్కాలికంగా వాయిదా పడిందని స్పష్టం చేసింది. 2024 ఏప్రిల్‌లో ఎంతో గ్రాండ్‌గా ప్రకటించిన ఈ సీక్వెల్‌ను 2025లో ఏడాది విడుదల చేయాలని మేకర్స్ భావించినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఇది 2026 సమ్మర్‌కి పోస్ట్‌పోన్ అయ్యే అవకాశం కనిపిస్తుంది. మరోవైపు చిత్ర దర్శకుడు గిరీష్ ప్రస్తుతం మమితా బైజు, నివిన్ పాలీలతో కలిసి 'బెత్లెహెం కుటుంబ యూనిట్' అనే మరో ప్రాజెక్ట్‌లో బిజీగా ఉండటం కూడా ఒక కారణమని తెలుస్తుంది. తెలుగులో ఎస్.ఎస్. కార్తికేయ ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ, చిత్ర నిర్మాణ సంస్థ 'భావన స్టూడియోస్' నుండి ఈ పుకార్లపై ఇంకా ఎలాంటి అధికారిక స్పందన రాలేదు.



# బైకర్‌లో రాజశేఖర్ పవర్‌ఫుల్ రోల్

ఒకప్పుడు టాలీవుడ్‌లో యాక్షన్ హీరోగా, యాంగ్రీ స్టార్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రాజశేఖర్ కొంతకాలం విరామం తర్వాత మళ్లీ ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. ఈసారి హీరోగా కాకుండా పవర్‌ఫుల్ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించడంతో సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. శర్వానంద్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'బైకర్' సినిమాలో రాజశేఖర్ కీలక పాత్ర పోషిస్తున్నారు. బైక్ రేసింగ్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రం ఏప్రిల్ 3న విడుదలకు సిద్ధమవుతోంది. ఇప్పటికే విడుదలైన టీజర్ సినిమాపై మంచి అంచనాలు తీసుకురాగా, తాజాగా మేకర్స్ రాజశేఖర్ పాత్రకు సంబంధించిన 'బు÷-లలెట్ సునీల్' గ్లింప్స్ విడుదల చేశారు. ఈ గ్లింప్స్‌లో రాజశేఖర్‌ను ఓ మాజీ పవర్‌ఫుల్ బైక్ రేసర్‌గా చూపిస్తూ స్టైలిష్ లుక్, గంభీరమైన ప్రెజెన్స్‌తో ఆకట్టుకున్నారు. కొన్నేళ్ల తర్వాత ఆయనను ఇంత ఎనర్జిటిక్‌గా, మాస్ షేడ్ ఉన్న పాత్రలో చూడబోతున్నామనే సంకేతాలు ఈ వీడియో ఇచ్చింది. గ్లింప్స్ విడుదలైన వెంటనే సోషల్ మీడియాలో మంచి స్పందన లభిస్తోంది. రాజశేఖర్ స్క్రీన్ ప్రెజెన్స్, బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ మళ్లీ పాత రోజుల్ని గుర్తు చేస్తున్నాయని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. 'ఇది రాజశేఖర్‌కు గ్యారెంటీ కంబ్యాక్ మూవీ అవుతుంది' అంటూ ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో ఆయన కనిపించడమే సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. శర్వానంద్‌తో పాటు రాజశేఖర్ లాంటి సీనియర్ నటుడు కీలక పాత్రలో కనిపించడం సినిమాకు అదనపు బలం అవుతుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. యూత్‌కు దగ్గరైన బైక్ రేసింగ్ కథతో పాటు అనుభవజ్ఞులైన నటుల ప్రెజెన్స్ ఉండటంతో 'బైకర్' మూవీపై అంచనాలు క్రమంగా పెరుగుతున్నాయి.



# చిరుమూవీలో సారా అర్జున్ ?

మన శంకర వరప్రసాద్ సినిమాతో మెగాస్టార్ చిరంజీవి బ్లాక్ బస్టర్ అందుకున్న విషయం తెలిసిందే. ఈ సినిమా అనంతరం సమ్మర్‌లో అతడి విశ్వంభర చిత్రం కూడా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే ఈ సినిమా తర్వాత బాబీతో మెగా 158 సినిమా చేయబోతున్నాడు చిరు. ఈ ప్రాజెక్ట్ గురించి ఒక ఆసక్తికరమైన వార్త ఫిలిం నగర్ వర్గాల్లో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ఈ చిత్రంలో చిరంజీవి కుమార్తెగా ఒక కీలక పాత్ర కోసం 'పొన్నియిన్ సెల్వన్' ఫేమ్, ధురంధర్ సినిమా సారా అర్జున్ పేరును దాదాపు ఖరారు చేసినట్లు సమాచారం. ఈ పాత్ర సినిమాలో అత్యంత కీలకం కానుందని తెలుస్తుంది. అయితే దీనిగురించి త్వరలోనే అధికారిక ప్రకటన రాబోతుంది. మరోవైపు చిరంజీవి కెరీర్‌లో ఇదొక ప్రత్యేకమైన మూవీగా నిలిచిపోతుందని మెగా అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతుండగా కన్నడ నిర్మాణ సంస్థ కేవిఎన్ ప్రొడక్షన్ బ్యానర్ ఈ సినిమాను నిర్మిస్తుంది.

Printed, Published and Owned by **V SAMPATH**, and Printed at Sharada Printers, H.No 1-6-6, Shastri Road, Karimnagar, Dist: Karimnagar -505001,Telangana State, and Published from 8-5-137, Gayathri Nagar, Karimnagar (Karimnagar District) 505001,Telangana State. **Editor: V SAMPATH. RNI NO : TELTEL/2023/89146** Email: shenarthimedia@gmail.com. Phone No: **9391343644**